# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 16 సంచిక : 6 నవంబరు - డిసెంబరు 2023 విడి ప్రతి వెల రూ. 5/- సంוּర చందా రూ॥ 100/-


## క్రిస్మస్ అద్భుతం! మహాద్భుతం!!

- జాయ్ చెరియన్

***సంపాదకురాలి కలమునుండి...***

పాఠకులకందరికీ క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభములు. క్రిస్మస్ అద్భుతమైన పండుగ. ఇది ఒక జాతి మతం తెగకు చెందినది కాదు. సర్వలోకము సంబరాలతో జరుపుకొనే గొప్ప ఏకైక పండుగ. క్రిస్మస్ విశిష్ఠతలు అద్భుతములు ప్రత్యేకతలు వివరించుటకు నేను ప్రేరేపింపబడ్డాను. ఎంతో మంది యుగపురుషులు, దేవుళ్లు, దేవతలు అనే పేరుతో ఈ లోకంలోకి వచ్చారు. వారందరూ వచ్చింది ఒక కారణం అయితే యేసుక్రీస్తు ఈ లోకానికి మరో కారణంతో వచ్చాడు. వాళ్లందరు దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుటకు వచ్చారు. కాని యేసుప్రభువు దుష్టులను శిక్షించుటకు కాదు గాని పాపులను ప్రేమించి రక్షించుటకు వచ్చాడు. యేసుప్రభువు రక్షకునిగా ఉదయించాడు. పాపులను ప్రేమించి వారికొరకు తన ప్రాణము పెట్టి రక్షణనిచ్చాడు.

ఆయన ఒక దేశానికి, ఒక ప్రాంతానికి, ఒక జాతికి చెందినవాడు కాదు. **"యేసుక్రీస్తు అందరికి ప్రభువు."** - అపో.కా. 10:36. క్రిస్మస్ సమయంలో దేవుని ఎరుగనివారికి క్రిస్మస్ శుభములు తెలిపినా వారెంతో సంతోషిస్తారు. క్రిస్మస్ పరమార్థం తెలియకున్నా క్రిస్మస్ సీజన్‌లో క్రీస్తుయొక్క పరిమళం అంతటా వ్యాపిస్తుంది. క్రిస్మస్ - క్రైస్తవులకైనా క్రైస్తవేతరులకైనా సర్వలోకానికి సంబరం. క్రీస్తుకు ఇతర దేవుళ్లకు వ్యత్యాసం ఏమిటి? ఎందరో దేవుళ్లు అనే పేరుతో ఉన్నారు కాని యేసుప్రభువు ఒక్కడే పాపులను ప్రేమించి వారి పాపములనుండి విడిపించుటకు వచ్చాడు. యేసుక్రీస్తు పేరుకు అర్థం - రక్షించుటకు అభిషిక్తుడు. ఆయన ఇమ్మానుయేలు అనే పేరుతో వచ్చాడు. ఇమ్మానుయేలు అంటే దేవుడు మనకు తోడని అర్థం.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన అద్వితీయ కుమారుడైన యేసుప్రభువును మన పాపములనుండి విడిపించుటకు మనకు అనుగ్రహించాడు. ఆ కుమారునియందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవము పొందుతాడు (యోహాను 3:16). యేసుప్రభువు - నేను పరిచారము చేయించుకొనుటకు రాలేదు; పరిచర్య చేయుటకు నా ప్రాణమును విమోచన క్రయధనముగా అర్పించుటకు వచ్చాను అంటాడు(మత్తయి 20:20). యేసుప్రభువు వద్దకు నన్ను ఆకర్షించింది ఈ ప్రత్యేకతలే. నేను క్రైస్తవత్వంలో ఓ గొప్ప కాపరి కుటుంబములో జన్మించినా అంత త్వరగా క్రీస్తును అంగీకరించలేదు. శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేసి సత్యాన్ని కనుగొన్నట్లు నేను ప్రభువును నమ్మడానికి చాలా సంవత్సరాలు ఆగాను. యేసుప్రభువు నిజమైన దేవుడని నమ్మడానికి చాలా కారణములు ఉన్నవి.

యేసుప్రభువు పలికిన మాటలు ఈ లోకంలో ఎవరూ ఎప్పుడూ పలుకలేదు. అవి నన్ను ఆకట్టుకొన్నవి. యేసుప్రభువు ఈ లోకానికి వచ్చి ప్రాణము పెట్టి పాపులను వారి పాపములనుండి విడిపించడం, శాపగ్రస్తులను వారి శాపములనుండి విడిపించడం రోగులను స్వస్థపరచడం అద్భుతం! మహాద్భుతం!! సిలువలో తన రక్తము చివరిబొట్టువరకు ధారపోసి మరణించి మూడవరోజు తిరిగి లేచాడు. అదీ యేసుక్రీస్తుయొక్క ప్రత్యేకత. చాలా మంది మరణించారు కాని తిరిగి లేవలేదు. యేసుప్రభువు మాత్రమే పునరుత్థానుడయ్యాడు. ఆయన మనకొరకు ఈ లోకానికి వచ్చి మరణించి తిరిగి లేచాడు. అంతేకాదు ఆయన మనకొరకు మరల రానైయున్నాడు. యేసుక్రీస్తు - నేనే మార్గం, నేనే సత్యం, నేనే జీవం (యోహాను 14:6) అన్నాడు. ఇంతవరకు ఆ మాట ఎవరూ అనలేదు. **"యేసు-పునరుత్థానమును జీవమును నేను."** - యోహాను 11:25 పరలోకమునుండి దిగివచ్చిన జీవాహారము నేను, నేను ఈ లోకానికి వెలుగైయున్నాను; మీరు ఈ లోకానికి వెలుగైయుంటారు. గొఱ్ఱెలు పోవు ద్వారమును నేనే, నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని అన్నాడు. మంచి కాపరి తన గొఱ్ఱెలకొరకు ప్రాణం పెడతాడు.

యేసుప్రభువు చెప్పిన ఇలాంటి మాటలెన్నో మనం సువార్తల్లో చూస్తాము. నేను నిజమైన ద్రాక్షావల్లిని, మీరు నాలో నాటబడితే బహుగా ఫలిస్తారు (యోహాను 15:1-5) అన్నాడు. ఇది నా జీవితంలో సంభవించింది. ప్రభువును నమ్మనప్పుడు బ్యాంక్‌లో మంచి ఉద్యోగం చేస్తూ లోకరీతిగా ఉన్నప్పుడు నేను ఫలించలేదు. అప్పుడు నేను పనిచేయుచోట మాత్రమే నేను వారికి తెలుసు. కాని ఎప్పుడైతే సువార్త నమ్మడం ప్రారంభించానో, ఎప్పుడైతే యేసుప్రభువుతో దగ్గరి సంబంధం కలిగియున్నానో, ఎప్పుడైతే ప్రభువు అనుచరురాలిగా మారి నా హృదయం ప్రభువుకు ఇచ్చానో, దేవుని పిలుపు పొంది బ్యాంక్ ఉద్యోగం వదిలి దేవుని సేవలో అడుగుపెట్టినప్పుడు నన్ను గుర్తించేవారు ప్రపంచమంతా ఉన్నారు. నిజమైన ద్రాక్షావల్లియైన క్రీస్తులో నాటబడినప్పుడు మనము విస్తారముగా ఫలిస్తాము. ఆయనయందు విశ్వాసముంచి ఆయన మాటలు గైకొంటే బహుగా ఫలిస్తారు.

యేసుప్రభువు **"పరిశుద్ధుడు"** అనే నామము కలిగియున్నాడు. అదీ నాకు అద్భుతమనిపించింది. **"నేను పాపములో పుట్టినవాడను పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను."** - కీర్తనలు 51:5 అని దావీదు భక్తుడు అంటాడు. కాని యేసుప్రభువు విషయంలో ఆలాగు చెప్పరాదు. యేసుప్రభువు పుట్టుకతోనే పరిశుద్ధుడు; పాపమెరుగనివాడు; ఆయన పురుష సంయోగము లేని కన్య మరియకు పరిశుద్ధాత్మద్వారా జన్మించాడు. ఇది యేసుప్రభువుయొక్క ప్రత్యేకమైన గుణం. మరియ గర్భధారణకు ముందు గ్రబియేలు దూత ఆమెతో ఇలా సెలవిస్తాడు. **"పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై**

"వారు (జ్ఞానులు).. యింటిలోనికి వచ్చి ... ఆ శిశువును చూచి... ఆయనను పూజించి ... బంగారమును సాంబ్రాణిని బోళమును కానుకలుగా ... సమర్పించిరి." - మత్తయి 2:10-11

**దేవుని కుమారుడనబడును."** – లూకా 1:35. ఈలాంటి నామకరణము ఎవరికీ లేదు. ఆయనలో పాపము లేదు.

యేసుప్రభువు పుట్టుక గురించి వందల సంవత్సరాల ముందే ప్రవక్తలు ప్రవచించారు. **"ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజముమీద రాజ్యభారముండును ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును."** – యెషయా 9:6 యేసుప్రభువు పుట్టుకకు 700 సంవత్సరాల ముందు యెషయా ప్రవక్త ఆయనకు ఆశ్చర్యకరుడు అనే పేరు పెట్టబడుతుందని చెప్పాడు. ఆయనను విశ్వసించువారు ఆశ్చర్యకార్యాలు చూస్తారు. నాకు యేసు ప్రభువుతో ఎన్కౌంటర్ జరిగినప్పుడు నా జీవితంలో అద్భుతాలు ఆశ్చర్యకార్యములు అనేకము చూశాను. నేను నాస్తికురాలిగా ఉంటిని. నా యౌవనప్రాయంలో 12 సంవత్సరాలు సువార్తను నమ్మలేదు. పాస్టర్ కుటుంబములోనే పుట్టినా ఎప్పుడూ భక్తి భక్తి అనే మాటలకు విసిగిపోయాను. నేనొక పాస్టర్‌గారి కుటుంబములో పుట్టినందున నేను క్రైస్తవురాలిని కావాలా? నిజమైన మార్గమేదని ఖురాన్, రామాయణం, మహాభారతం మొదలైన పుస్తకాలెన్నో తెచ్చుకొని నా అన్వేషణ ఆరంభించాను. కాని చివరికి దేవునియందు భయభక్తులు కలిగిన నా తలిదండ్రుల ప్రార్థననుబట్టి నా పయనం ఆగి దేవునితో సహవాసంలోకి వచ్చాను. యేసుతో సన్నిహితమైన సంబంధం ఆరంభించినప్పుడే నా వెదకులాట ఆగిపోయింది; నేను సంతృప్తి చెందాను. నేను పరిశుద్ధ గ్రంథము చదువుతున్న కొలది ప్రభువు నాతో మాట్లాడుతూ వచ్చాడు.

యేసుక్రీస్తుయొక్క జననవార్త మొదట గొఱ్ఱెల కాపరులకు తెలియజేయబడుట నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణముగా మనము ఒక మంచి వార్త, శుభవార్త, ప్రాముఖ్యమైన వార్త ప్రాముఖ్యమైనవారికే చెబుతాము. ప్రభువు ఎంత ప్రేమగలవాడు! దీనులకు ఈ సువర్తమానము అందించబడింది. గొఱ్ఱెలకాపరులు పామరులు, నాగరికత లేకుండా గొఱ్ఱెలను మేపుతూ ఉండేవారు. కాని దేవుడు మహోన్నతుడైనా, మహాఘనుడైనా ఆయన దీనులను లక్ష్యపెడతాడు. అందరూ పెద్దవారికి పీటములేసి చిన్నవారిని లెక్కబెట్టరు. వారితో మాట్లాడితే హోదా తక్కువైపోతుందనుకొంటారు. పాపులను నీచులను చూసి ముఖం తిప్పుకొంటారు. కాని యేసుప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు పాపులను తన దగ్గరికి రానిచ్చాడు. సుంకరులు, పాపులతో స్నేహం చేశాడు. వారితో కలిసి భోజనం చేశాడు. అప్పుడు పరిసయ్యులు, శాస్త్రులు – ఈయన సుంకరులతో పాపులతో సహవాసం చేస్తున్నాడని విమర్శించారు. అప్పుడు ప్రభువు – ఆరోగ్యము ఉన్నవారికి వైద్యుడు అవసరం లేదు; రోగికే వైద్యుడు అవసరం అని చెప్పాడు. ఆలాగే పాపికి రక్షకుడు అవసరం.

యేసుప్రభువు రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు, సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే నివసించువాడని, ఆయన అమరత్వంగలవాడు శ్రీమంతుడని (1తిమోతి 6:15) ధ్యానించి **"దేవుని వెయ్యి నామములు"** పుస్తకము వ్రాసినప్పుడు ఈ నామములు నాకెంతో ఆకర్షణీయంగా అనిపించాయి. ఇవి యేసుప్రభువుయొక్క బిరుదులు. ఆయన శ్రీమంతుడు రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు. ఆయన రాజభవనంలో పుట్టాలిగాని పశువులపాకలో పుట్టడమేమిటి? ఆయన ఈ లోకానికి దీనుడుగా వచ్చాడు. ఈలాగు దీనత్వం ధరించుకొని ఎవరికొరకు వచ్చాడు? దేవుడైయుండి తండ్రి కుడిపార్శ్వమున ఉండే పరలోక భాగ్యాన్ని త్యజించి మానవుడై ఈ లోకానికి వచ్చి దాసుడై తన్ను తాను రిక్తునిగా చేసికొని మరణం పొందునంతగా తండ్రికి విధేయత చూపి తన ప్రాణము అర్పించాడు. ఆయన ఎంతగా తగ్గించుకొన్నాడో తండ్రి అతని అంతగా హెచ్చించి అన్ని నామములకంటే పై నామము అనుగ్రహించాడు. ఆ నామంలో ప్రతి మోకాలు వంగుతుంది, ప్రతి నాలుక ఆయన నామమును మహిమపరుస్తుంది. కావున మనము దేవుని స్తుతించాలి, ఆయనలో ఆనందించాలి.

యేసుక్రీస్తును గూర్చిన మంచి అవగాహన కలిగియుంటే మనము ఈ లోకంలో ఎవరికీ భయపడము. యేసుక్రీస్తు జననమునకు సంబంధించిన వాక్యభాగములలో పలుమార్లు **'భయపడకుము'** అనే పదం కనబడుతుంది. మరియతో, యోసేపుతో, జెకర్యాతో, గొఱ్ఱెల కాపరులతో దూత – భయపడకుము అంటాడు. ప్రభువును మన హృదయంలో ప్రతిష్ఠించుకొన్న తర్వాత రోగానికి, ఆర్థిక ఇబ్బందులకు, అంటువ్యాధులకు భయపడవద్దు. నీలో ఉన్నవాడు లోకంలో ఉన్నవానికంటే గొప్పవాడు. **"శ్రీమంతుడును అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్తకాలములయందు ఆ ప్రత్యక్షతను కనుపరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు. సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వముగలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు; ఆయనకు ఘనతయు శాశ్వతమైన ప్రభావమును కలిగియుండును గాక. ఆమేన్."** – 1 తిమోతి 6:15-16

మనము ఎంత గొప్ప దేవుని సేవిస్తున్నాము, ఆరాధిస్తున్నాము. కొందరు ఆరాధించేటప్పుడు కేవలం పెదవులతో ఆరాధిస్తారు. వారి మనస్సు ఎక్కడో ఉంటుంది. కాని నీవు నిజంగా దేవుని ప్రేమిస్తే, సిలువలో నీకొరకు ఆయన చేసిన కార్యాలపై నీ మనస్సు నిలిపితే ఖచ్చితముగా నోరు విప్పకుండా ఉండలేవు; నీ స్వరమెత్తి పాడుతావు, చప్పట్లు కొట్టి ఆరాధిస్తావు. ఆయన ఆరాధనకు యోగ్యుడు, స్తుతులకు పాత్రుడు. ఆయన పుట్టుక చాలా దీనమైన పుట్టుక. ఒకవేళ రాజభవనంలో పుడితే ఆయన అందరికీ అందుబాటులో ఉండేవాడు కాదు. ఆయన పశువుల పాకలో జన్మించాడు. సత్రములో ఆయనకు స్థలం లేదన్నారు. పశువుల పాకగూర్చి ఆలోచిస్తే చాలా భయకంపితంగా అనిపిస్తుంది. మరియ ఎంతో ధైర్యవంతురాలు. యోసేపుకూడా ఆమెకు ఎంతో సహకరించాడు. నిండు చూలాలు పశువుల మధ్యలో యేసుప్రభువుకు జన్మనిచ్చింది. ఆలోచిస్తే పశువులపాక ఎంత అశుచిగా ఉంటుంది. దీనిని బట్టి నాకు అర్థమైందేమిటంటే ఎటువంటి అపరిశుద్ధమైన హృదయంలో అయినా, కటిక చీకటిలోనైనా యేసుప్రభువు జన్మిస్తూనే ఉంటాడు. యేసుప్రభువు డిసెంబర్ 25న జన్మించాడని అంటారు. ఆయన నిరంతరము పాపములు ఒప్పుకొని తన తట్టు తిరిగిన పాపుల హృదయాల్లో జన్మనెత్తుతూనే ఉన్నాడు.

యేసుప్రభువు బేత్లెహేములో ఎందుకు పుట్టాడు? బేత్లెహేము ప్రపంచముయొక్క నడిబొడ్డు, బేత్లెహేము ఇశ్రాయేలు దేశంలో యూదయ రాష్ట్రంలో ఉంది. బేత్లెహేమనే పల్లెలో ఆయన పుట్టాడు. ఈయన జగత్ రక్షకుడైనా అందరికి అందుబాటులో ఉండాలని అక్కడ పుట్టాడు. బేత్లెహేమంటే రొట్టెల ఇల్లు అని అర్థం. ఆయన నజరేతనే ఊరిలో పెరిగాడు. నజరేతు అక్రమాలు, వ్యభిచారము, దొంగతనము, త్రాగుబోతులు, దుర్మార్గులుండే స్థలం. అక్కడ యేసుప్రభువు పెరిగాడు. కాని యేసుప్రభువులో ఉన్న గొప్ప తనమేమిటంటే ఆయన నజరేతులో పెరిగినందుకు ఆ నజరేతుకు గొప్ప పేరు వచ్చింది. అపొస్తలులు ఆయన నజరేయుడని పదేపదే వ్యక్తపరచారు. పుట్టు కుంటివానితో – మా దగ్గర వెండిబంగారములు లేవు గాని నజరేయుడైన యేసునామములో లేచినడవమంటే వాడు దిగ్గునలేచి నడిచాడు (అపొ.కా. 3:1-10). ఆయన పేరుకు ముందు నజరేయుడనే ఉపసర్గ ఉంటుంది. భక్తులు ప్రార్థించినప్పుడు నజరేయుడైన యేసునామంలో అడుగుతున్నామని ప్రార్థిస్తారు. నజరేతుకు ఇంత ప్రాధాన్యత వచ్చింది యేసుప్రభువు ద్వారానే. ఆలాగు యేసుప్రభువును అంగీకరించి రక్షణ పొందినవారు, యేసుప్రభువు అనుచరులు, ఆయనకు విధేయత చూపి ఆయనను వెంబడించేవారుకూడా ఈలాగు ధన్యులు కావడం మనం చూస్తాము. కొంతమంది గొప్ప సేవకుల సాక్ష్యములు గమనిస్తే – మేము త్రాగుబోతులముగా ఉంటిమి, మేము పాపములో పడి ఉంటిమి; ప్రభువును అంగీకరించిన తర్వాత మా జీవితాలన్నీ మారిపోయినవి అనే మాటలు నన్ను ఎంతో ఆకట్టుకొన్నవి. **"కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను."** – 2 కొరింథీ 5:17 అని పౌలు భక్తుడు అంటాడు. మరే మార్గములోనైనా వారిని అనుసరించుటద్వారా నూతన సృష్టిగా మారినట్లు మీరు గమనించారా? కేవలం క్రైస్తవత్వంలోనే ఈ కార్యము గమనిస్తాము. ఎప్పుడైతే నీవు యేసుక్రీస్తును అంగీకరిస్తావో అప్పుడు పాత కార్యాలు గతించి


ప్రతిదీ క్రొత్తదవుతుంది. నీ పాత జీవితాన్ని జ్ఞాపకము తెచ్చుకొంటే నీ పేరుకు, చిరునామాకు, ప్రాముఖ్యత లేదు. కాని యేసుప్రభువు నీలో జన్మించినప్పుడు నీ జీవితం మారిపోయింది. ఎక్కడ ఘనహీనులముగా ఉన్నామో అక్కడ ఘనత పొందుతున్నాము. నూతన పేరు అనుగ్రహింపబడింది.

ఆనాడు యేసుప్రభువు గాడిదమీద యెరూషలేముకు జయప్రవేశం చేసినప్పుడు గాడిదకుకూడా అంతటి ఘనత దొరికింది. మనుష్యుల్లో ఎవరైనా పిచ్చిపని చేసినప్పుడు వారిని మొదట – గాడిద, నీకు అస్సలు బుద్ధిలేదని అంటారు. అటువంటి ఆ గాడిదకు ప్రభువును మోసినందుకు ఎంతో ఘనత లభించింది. దారిపొడుగున పట్టుబట్టలు, కొబ్బరిమట్టలు, తెల్లని వస్త్రాలు పరిచారు. యేసుప్రభువు ఒక్క అడుగైనా దానిపై పెట్టలేదు. ఆ బట్టలను గాడిదే తొక్కుతూ వెళ్లింది. ఇదీ నన్ను ఎంతో ఆశ్చర్యచకితురాలిని చేసింది. నేనెప్పుడూ అనుకోలేదు–వేలు, లక్షల మంది ముందు నిలబడి వాక్యం చెబుతానని. నేను ఇది కలలోకూడా ఊహించలేదు. నేను యేసుప్రభువును అంగీకరించినందుకు నా జీవితం నా తలంపులు, నా పద్ధతి, నా మార్గం మారిపోయింది. అది కేవలం యేసుప్రభువు మాత్రమే చేయగలడు. నాకొక క్రొత్త జీవితం కావాలి; ఈ రోత, పాప జీవితము ఇక చాలు అనుకొనేవారికి యేసుక్రీస్తే జవాబు. నేను ఎక్కడున్నా నాయకత్వపు లక్షణాలు కలిగి ఉండేదాన్ని. చాలా తిరుగుబాటుతో కూడిన నాయకురాలిగా ఉంటిని. కఠినముగా మాట్లాడేదాన్ని. బెదిరిస్తే అందరు వణికిపోయేవారు. చిన్నప్పటి నుండే నేను క్లాస్ లీడర్‌ని తర్వాత కాలేజి లీడర్‌ని, బ్యాంక్‌లో హాస్టల్‌లో అంతటా నేనే నాయకురాలిగా ఉంటిని. కాని యేసుక్రీస్తుని నా హృదయంలోకి ఆహ్వానించాక నా హృదయం క్రీస్తు ప్రేమతో నిండిపోయింది. క్రీస్తుయేసుయొక్క మనస్సు నాకు వచ్చింది. ఈ రూపాంతరం ప్రభువువలన కలిగింది. మా ఇంటివారే – ఈమె స్వభావమంతా మారిపోయిందంటారు. నన్ను మార్చినది ఎవరోకాదు; యేసుప్రభువే. ఆయనే మనుష్యుల్లో మార్పు కలుగజేయువాడు.

క్రిస్మస్ అందరి పండుగ. ఇది మహా పండుగ. ఇది మా క్రిస్మస్ అని అనకూడదు. యేసుక్రీస్తు అందరికి ప్రభువు. ఆయన సర్వలోక పాపపరిహారార్థం ఈ లోకానికి వచ్చాడు. ఆయన అందరిని ప్రేమిస్తున్నాడు. ఆయనలో ఏ పక్షపాతము లేదు. ఆయనయందు భయభక్తులుగలవారిని అంగీకరించుటకు ఆయన ఎప్పుడూ సంసిద్ధుడైయున్నాడు. క్రిస్మస్ మహా సంతోషకరమైన శుభవర్తమానం అని లూకా సువార్తలో వ్రాయబడి ఉంది. యేసుప్రభువు ఈ లోకానికి రావడం చాలా సంతోషకరమైన కార్యం. **"ఆ దేశములో కొందరు గొఱ్ఱెల కాపరులు పొలములో ఉండి రాత్రివేళ తమ మందను కాచుకొనుచుండగా ప్రభువు దూత వారియొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారిచుట్టు ప్రకాశించినందున, వారు మిక్కిలి భయపడిరి. అయితే ఆ దూత – భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీ కానవాలు; ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను."** – లూకా 2:8–12. ఇది కొందరికి మాత్రమే కాదు ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానం. బలవంతుడైన గొప్ప దేవుడు శిశువుగా పుట్టాడు. ఆయనను హృదయంలో చేర్చుకొన్నవారు క్రమక్రమంగా మితిలేని అభివృద్ధి పొందుతారు. మనము ఒక శిశువును పెంచుతూ వచ్చినప్పుడు వారు ఏలాగు గొప్ప వ్యక్తిత్వంలోకి పెరుగుతారో ఆలాగు యేసును అంగీకరించినవారు క్రమక్రమంగా ఔన్నత్యాన్ని పొందుతారని యెషయా ప్రవక్త ప్రవచించాడు. **"ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని నెరవేర్చును."** – యెషయా 9:7. రాజు, రాజ్యము అన్నప్పుడు ఆయన నీ హృదయంలోనే రాజుగా ఉన్నాడు. రాజు ఉన్న చోట రాజ్యం ఉంటుంది. సిలువలో కుడివైపున ఉన్న దొంగ – యేసుక్రీస్తు రాజని గ్రహించాడు; కావున నీవు నీ రాజ్యంలో నన్ను జ్ఞాపకం చేసికో అని విన్నవించుకొన్నాడు. ఆయన స్వభావము మానవ స్వభావానికి విరుద్ధంగా ఉందని, ఆయన దైవస్వభావం గలవాడు అని గ్రహించాడు. కొట్టేవారిని, దూషించేవారిని, కొయ్యకు మేకులతో కొట్టేవారిని, ప్రక్కలో బల్లెముతో పొడిచేవారిని, చాటవారుతో వీపుపై కొరడా దెబ్బలు కొట్టేవారినందరిని క్షమించి – తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని ప్రార్థిస్తున్నాడు. ఇదేమి గొప్ప స్వభావము! ఈయన దేవుని కుమారుడు; పరలోకములో రాజు గనుక – నీ రాజ్యములో నన్ను జ్ఞాపకం చేసికోమంటాడు. అప్పుడు ప్రభువు – నేడే నీవు నాతో పరదైసులో ఉంటావని చెబుతాడు. ఆయన ఎంత గొప్ప దేవుడు! ఆయన తన బాధల్లోకూడ సువార్త పని చేశాడు. తండ్రి పిలుపును పొంది చివరి శ్వాసవరకు విధేయత చూపాడు. సిలువలో వ్రేలాడుతూకూడా ఒక పాపికి రక్షణ నిచ్చాడు. ఆయన లోకానికి వచ్చిన కర్తవ్యాన్ని తుదివరకు నిర్వర్తించాడు. అనేకులు మాట ఇస్తారుగాని మరల కనబడరు. ఎలక్షన్ల సమయంలో చాలా గంభీరమైన మాటలు వింటాము గాని వారు గెలిచాక అడ్రస్ లేకుండా పోతారు. యేసును తెలుసుకొన్నాక నా అనుభవమేమంటే – పరిశుద్ధ గ్రంథంలో ఉన్న యేసు పలికిన ప్రతిమాట బంగారు మాట. యేసుప్రభువు ఉత్తముడని నేను నా జీవితంలో రుచిచూచి తెలిసికొన్నాను. క్రిస్మస్‌లో క్రొత్తబట్టలు, ఇంటికి పెయింటిగ్ వేయడం, ఇల్లు అలంకరించుకోవడం, పిండి వంటలు చేయడం ప్రత్యేకం కాదు. క్రిస్మస్ సందర్భంలో క్రీస్తునుగూర్చి ప్రచురించడం ప్రాముఖ్యమైనది. దేవుని ప్రేమను ప్రచురము చేయండి. **"కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును."** – యోహాను 3:36. కావున కుమారునియందు విశ్వాసం ఉంచాలి. క్రీస్తుయందు విశ్వాసముంచుటద్వారా క్రీస్తు ప్రేమను నిండుగా అనుభవించగలము.

క్రిస్మస్ అంటే దేవుడు మానవుడైన రోజు. యేసుక్రీస్తు జననంతో కాలము రెండు ముక్కలైంది. క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం. ఇదికూడా చెప్పకనే చెబుతుంది క్రీస్తు మన జీవితాలకు కేంద్రమని. జ్ఞానులు ప్రభువును వెదకవచ్చారు. పాతనిబంధనలో ప్రవక్తలు – నక్షత్రము యాకోబులో ఉదయించును, రాజదండము ఇశ్రాయేలులోనుండి లేచును (సంఖ్యాకాం. 24:17) అని ప్రవచించారు. వేల సంవత్సరాలకు ముందు వ్రాయబడిన వాక్యం అద్భుతంగా నెరవేరడం చూస్తాం. జ్ఞానులు నక్షత్రాన్ని వెంబడిస్తూ వచ్చారు ఇవన్నీ ప్రవచనాల నెరవేర్పు.

యేసుప్రభువు పుట్టుక, జీవితం ప్రత్యేకమైనవి. యేసుప్రభువు ఈ లోకంలో ఏదీ సంపాదించలేదు. యేసుప్రభువు అన్నీ అద్దె వస్తువులతో జీవించాడని ఓ భక్తుడు వ్రాశాడు. ఆయనకు ఒక పడవకూడా లేదు. ఆయనకు ఇల్లు లేదు, డబ్బు సంచి ఆయన దగ్గర లేదు. ఆయన తనగూర్చి ఏమీ గొప్పలు చెప్పుకోలేదు. కాని ఆయనగూర్చి చెప్పుకొనుటకు ఇప్పుడు మన జీవితాలు సరిపోవడం లేదు. కావున ఈ క్రిస్మస్ సమయంలో క్రీస్తుకు మన హృదయాలు సమర్పించుకొంటే ఎంత ఘోర పాపాత్ములనైనా ఎంత రోత బ్రతుకులనైనా ప్రేమగల దేవుడు స్వీకరిస్తాడని నేను చెబుతున్నాను. జెక్కయ్యకు యేసును చూడాలని ఆశ కలిగి మేడి చెట్టు ఎక్కాడు. ప్రభువు ఆ మార్గం గుండా వెళ్తు – జెక్కయా, త్వరగా దిగిగా, నేడు నీ ఇంటికి రావాల్సియున్నదని ఆయన ఆశ తీర్చి మారుమనస్సు రక్షణ అనుగ్రహించాడు. ప్రయాసపడి భారం మోస్తున్న సమస్త జనులారా మీరు నా యొద్దకు రండి నేను మీకు రక్షణ అనుగ్రహిస్తాను అన్నాడు (మత్తయి 11:28). క్రిస్మస్‌లో దీనత్వం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. నీవు ఎప్పుడైతే దీనహృదయంతో నీ పాపాలు ఒప్పుకొని విడిచి పెడతావో, నిత్యజీవముకొరకు ఆశిస్తావో ఆయన చేతులు ఎల్లప్పుడు నీకొరకు చాపబడి ఉన్నాయి. ఆయనయందు విశ్వాసం ఉంచితే నీవు కలవరపడవు, నశింపక నిత్యజీవమును సంపాదించుకొంటావు.



దేవుడు మిమ్మును దీవించి క్రిస్మస్ ఆనందము అనుగ్రహించును గాక.

# దేవుని సహస్రనామములు

## 370. మనుష్యులు చూడనొల్లనివాడు

– యెషయా 53:3

**"అతడు తృణీకరింపబడినవాడును ఆయెను మనుష్యులవలన విసర్జింపబడినవాడును వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను. అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి."** – యెషయా 53:3

మనుష్యులు చూడనొల్లనివాడుగా ప్రభువు మారిపోయాడు. మనమతని చూచి అపేక్షించునట్లుగా అతనియందు సురూపము లేదని ప్రవక్త చెప్పిన మాటలు నెరవేరాయి. సుందరుడు అందవిహీనుడిగా, అతికాంక్షణీయుడు మనుష్యులు చూడనొల్లనివానిగా మారిపోయాడు. మనము చూచి అపేక్షించునట్లుగా ఆయన సుందరుడిగా లేడు. ముఖమంతా రక్తమయము, దేహమంతా గాయములు, బరువైన సిలువను మోస్తు పడరాని పాట్లు పడుతున్నాడు. మనుష్యులు అతనిని చూడటానికి ఇష్టపడటము లేదు. శరీరమంతా బలహీనముగా అయిపోయింది. రాత్రంతా నిద్రలేదు. సిలువ మరణమునకు ముందు గెత్సేమనే తోటలో బహు దుఃఖముతో, వేదనతో ప్రార్థించాడు. ప్రార్థన చాలించగానే యూదా దొంగముద్దు పెట్టి రాణువ వారికి అప్పగిస్తాడు. రాణువవారు సంకెళ్లతో బిగించి ప్రధాన యాజకులు శాస్త్రులయెదుట నిలువబెడతారు. ప్రేమించిన శిష్యులందరు ప్రభువును ఒంటరివాడిని చేసి భయపడి పారిపోయారు. ప్రభువుకు తోడుగా ఒక్కరైనను లేరు. ఆ రాత్రంతా తిన్నావా? దాహమవుతుందా? అని అడిగేవారులేరు. ఆ రాత్రంతా ఆకలిదప్పులతో, నిద్రలేమితో గడిపాడు. అన్న కయప అన్యాయపు తీర్పు తీరుస్తున్నారు. నిందలు మోపుతున్నారు. శారీరకమైన శ్రమ, మానసికమైన శ్రమ అనుభవిస్తున్నాడు. ఆకలి దప్పులతో కడుపు ఎండిపోయింది. నాలుక దవడను అంటుకొని పోయింది. శరీరములోని నీరంతా పోయి ఎముకలు లెక్కబెట్టే రీతిగా అయిపోయాడు. దేహమంతా రక్తము, పిడిగుద్దులు గుద్దుతున్నారు. ముఖముమీద ఉమ్ముతున్నారు. వస్త్రాలు లాగివేస్తున్నారు. ఇంతకంటే ఘోరమైన అవమానము ఏముంటుంది? మనుష్యులు చూడనొల్లని వాడుగా మారిపోయాడు. ఈనాడు ప్రభువు నామములో దేవుని సేవకులుగా పిలువబడుతున్నవారలారా! ఆనాడు ఆయన తన అందము కోల్పోయి, మనుష్యులు చూడనొల్లనివాడిగా మారి ఈనాడు నీకు ఆశీర్వాదమనుగ్రహించి సౌందర్యము అనుగ్రహిస్తున్నాడు. మన నిమిత్తము ఆయన చూడనొల్లనివాడిగా మారి తండ్రి చిత్తమును నెరవేర్చాడు. దేవునికి స్తోత్రం!

నీవు వ్యక్తిగత సిలువ ఎత్తుకున్నప్పుడు ఒంటరి జీవితము అనుభవిస్తే భయపడనవసరము లేదు. ప్రభువు నీకు మంచి మాదిరి చూపాడు. ఒకవేళ నీవు ఒంటరి వాడవయితే నీ ఒంటరి తనములో తోడైయుండటానికే ఆనాడు ప్రభువు సిలువలో ఒంటరి తనమును అనుభవించాడు.

యేసుప్రభువుయొక్క సిలువ శ్రమలనుగూర్చి ఎంత వివరించినా అది తక్కువే. అందుకే పౌలు భక్తుడు అంటున్నాడు.

**"సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి."** – 1 కొరింథీ.1:18

**"యూదులు సూచకక్రియలు చేయుమని అడుగుచున్నారు, గ్రీసుదేశస్థులు జ్ఞానము వెదకుచున్నారు. అయితే మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము."** – 1 కొరింథీ.1: 22,23

సిలువ వేయబడిన క్రీస్తునుగూర్చి నీ జీవితాంతము ప్రకటించినా తనివితీరదు. సిలువనుగూర్చిన సత్యములు ధ్యానిస్తుంటే మనము రూపాంతరము చెందుతుంటాము. ఆత్మీయముగా దినదినము ఎదుగుతాము. ఆయన సారూప్యములోకి మలచబడతాము. మనల్ని చూచేవారు మనలో యేసుప్రభువును చూడగలుగుతారు. యేసుప్రభువును ఒక్కసారి తరచి చూడు. ఆయన తృణీకరింపబడినవానిగాను, విసర్జింపబడినవానిగాను, వ్యసనాక్రాంతుడిగా, వ్యాధిగ్రస్తుడిగా, మనుష్యులు చూడనొల్లనివానిగా, మొత్తబడినవానిగా, దేవునివలన బాధింపబడినవాడుగా మారిపోయినను తండ్రి చిత్తమును నెరవేర్చాడు. బాధలన్ని మౌనముగా సహించాడు. ఇవన్నీ ధ్యానిస్తే శక్తితో నింపబడతావు. యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుతారు. పక్షిరాజు వలె రెక్కలు చాపి పైకెగురుతారు. అలయక పరుగెత్తుతారు. సొమ్మసిల్లక నడిచి పోతారు. దేవునికి స్తోత్రము! హల్లెలూయ!

నీ సేవా జీవితములో వ్యక్తిగత జీవితములో నీమీద ఎవరైనా నిందలు మోపి బాధిస్తే ప్రభువును జ్ఞాపకం చేసికో. మనుష్యులు నిన్ను చూచి ముఖము త్రిప్పుకుంటున్నారా? ఒంటరితనముతో బాధననుభవిస్తే ప్రభువును జ్ఞాపకము చేసికో. నీతో ఎవ్వరూ మాట్లాడకుంటే దేవునితో మాట్లాడు. దేవుని సన్నిధిలో సమయం గడుపు. మోకరించి ప్రార్థించు. ఆయన తన సన్నిధికాంతి నీ మీద ప్రసరింపజేసి నీ వ్యసనములు సంకటములన్నిటిని కుదుర్చుతాడు. నీవు శ్రమలనుభవిస్తే ఆయన సిలువ శ్రమలలో పాలు పొందియున్న రీతిగా ఆనందించాలి.

## 371. మొత్తబడినవాడు

– యెషయా 53:4

**"నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడినవానిగాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి."** – యెషయా 53:4

దేవుడు మొత్తుతున్నాడని, మొత్తబడుతున్నామనే మాట సాధారణముగా మనము వింటూనే ఉంటాము. యేసుప్రభువు నామము **'మొత్తబడినవాడు'** అని ధ్యానిస్తున్నాము. దేవుడే మనందరి నిమిత్తము ఆయనను మొత్తాడు. ఎవరైనా రోగముతో ఉంటే తోటి విశ్వాసులే అంటారు. ఆ రోగము ఎందుకు వచ్చిందో తెలుసా? దేవుడే ఆ వ్యక్తిని మొత్తుతున్నాడని తీర్పు తీర్చేస్తారు. మొత్తబడినవాడని నిన్నెవరయినా అంటే బాధపడకు. ప్రభువా, నీవు నాకొరకు నలుగగొట్టబడ్డావు. మొత్తబడ్డావు. మొత్తబడినవానిగా ఎంచబడినావు. నిన్ను నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమయినది. నీవు బాధలన్ని మౌనముగా సహించావు, నాకు నీ శక్తిని ప్రసాదించుమని అడుగు.

మనము బాధపడుతుంటే సానుభూతి చూపించడానికి బదులు సూటిపోటి మాటలు అంటుంటారు. అయ్యో పాపము అనడానికి బదులు ఏ పాపము చేశాడో దేవుడు మొత్తాడు. లేకుంటే ఎందుకీ బాధ, ఇన్ని కష్టాలు అంటూ ప్రశ్నిస్తారు.

యోబు భక్తుని దేవుని అనుమతితో అపవాది మొత్తినప్పుడు యోబు భక్తుడు తనకు కలిగిన సమస్తమును కోల్పోతాడు. ఆస్తి, కుమారులు, కుమార్తెలు కలిగిన సమస్తమును ఒక్క దినములో కోల్పోయాడు. అయినను యోబు భక్తుడు ఎవరినీ దూషించలేదు. నిందలు మోపలేదు. యెహోవా ఇచ్చెను యెహోవా తీసికొని పోయెను. దేవుని నామమునకు స్తుతి కలుగునుగాక అంటూ దేవుని నామమును మహిమపరచాడు. దేవుడు తనకు అన్యాయము చేశాడని చెప్పలేదు. దేవునికి స్తోత్రం!

తరువాత అపవాది దేవుని అనుమతితో యోబును – అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు కురుపులతో మొత్తాడు. అప్పుడు యోబు భార్య – ఇంకా ఎందుకు దేవుడు, దేవుడు అంటావు? నీ యథార్థతను విడిచిపెట్టి దేవుని దూషించి మరణము కమ్మని అంటుంది. అందుకు యోబు భక్తుడు ఎందుకు మూర్ఖురాలివలే మాట్లాడుతున్నావు; దేవునివలన మేలే అనుభ వించుదుమా? కీడును మనము అనుభవింపతగదా? అని అంటాడు. చూశారా, కష్టసుఖములలో అంతమువరకు తోడుగా ఉండవలసిన జీవిత

భాగస్వామికూడ యోబును విడిచివెళ్లిపోయింది. పరామర్శించడానికి వచ్చిన స్నేహితులు దేవుడు అన్యాయము చేస్తాడా? నీతిమంతులు బాధింపబడతారా? నీవేమి పాపము చేశావో శిక్ష అనుభవిస్తున్నావని అంటారు. కాని యోబు భక్తుని దేవుడు శ్రమలలో ఒంటరిగా విడిచి పెట్టలేదు. తగిన కాలమందు తన ప్రత్యక్షత అనుగ్రహించి యోబుతో ముఖాముఖిగా మాట్లాడి ఆయనను రెండంతలుగా ఆశీర్వదిస్తాడు. హల్లెలూయ!

యేసుప్రభువు మన పాపముల ప్రాయశ్చిత్తముగా వెల చెల్లించడానికి మొత్తబడ్డాడు. ఏ పాపమెరుగని పరిశుద్ధుడు మన కొరకు పాపముగా మార్చబడ్డాడు. దేవుని రక్షణ సంకల్పము నెరవేర్పుకొరకు, సర్వమానవాళి రక్షణార్థము సిలువ శ్రమలు మౌనముగా సహించాడు. మనకై నలుగగొట్టబడ్డాడు. దూషింపబడ్డాడు. కొరడాలతో కొట్టబడ్డాడు. ముళ్ల కిరీటము తలపై గ్రుచ్చారు. దేహమంతా రక్తమయము, గాయములు. మన పాపపరిహారార్థము ఆయన పరిశుద్ధ రక్తమును సిలువలో చిందించాడు. సిలువలో పటుబాధలు ప్రభువు అనుభవిస్తుంటే సానుభూతి చూపేవారు లేరు. ఈయన లోకరక్షకుడు కదా, ప్రజలను వారి పాపములనుండి రక్షించడానికి వచ్చాడు కదా, రక్షకుడయితే తన్ను తాను రక్షించుకోలేని వాడు ప్రజలనేమి రక్షిస్తాడు? ఈయన దేవుని కుమారుడయితే దేవుడు వీడిని రక్షిస్తాడేమో చూద్దామని సూటిపోటి మాటలతో అపహాస్యము చేస్తున్నారు.

ఎన్నోసార్లు మనము ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుంది. వీరు దేవుని సేవకులు, ఎందుకిన్ని శ్రమలు అంటారు. ప్రజలకు తెలియదు. దేవుని సేవకులు శ్రమల గుండా వెళ్లేది ప్రజల శ్రమలు అర్థము చేసికోవడానికే దేవుడు వారికి తర్ఫీదు నిస్తున్నాడని. మనకంటే ముందు మన ప్రభువునే నిందించిన లోకము మనకు పూలమాలలు వేస్తుందా? ప్రభువు చూపిన మాదిరిలో సేవా జీవితములో సాగిపోవాలి.

ప్రభువు మొత్తబడ్డాడు ఎందుకంటే అది పరమతండ్రియైన దేవుని చిత్తమై యున్నది. అతనిని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమయినది. పరమ తండ్రియైన దేవునివలన బాధింపబడ్డాడు. వ్యసనాక్రాంతుడిగా, వ్యాధిగ్రస్తుడిగా, మొత్తబడినవానిగా, దేవునివలన బాధింపబడినవానిగా మారిపోయాడు. ఎందుకంటే మన దోషములు, దుఃఖములు, వ్యాధులు, సిలువలో భరించాడు. సిలువకు సంబంధించిన ఈ నామములు ధ్యానించినప్పుడు ప్రభువుమీద మిక్కుటమైన ప్రేమ పెరిగిపోతుంది. దేవుని ప్రేమ, కృపా కనికరములు ఎంత గొప్పవి. ఆయన మనకొరకు మొత్తబడ్డాడు. పరమ తండ్రితో ఆయన సింహాసనమందు కూర్చునే ఆ గొప్ప భాగ్యమును విడిచిపెట్టి దివినుండి భువికి దిగివచ్చాడు. నీవు సమస్తమైన ఆశీర్వాదములు పొందడానికే ఆయన సమస్తమును కోల్పోయి తన్ను తాను రిక్తునిగా చేసికున్నాడు. నీవు ఈ రోజు ప్రకాశమానముగా అందముగా ఉండడానికే ఆనాడు సిలువలో ప్రభువు ముఖము వికారమయింది. నీవు ఈ రోజు ప్రభువులో ఆనందిస్తు సహవాసములో కూడుకొని దేవుని స్తుతిస్తు పాటలు పాడుతు సంతోషించ గలుగుటకే ఆనాడు ప్రభువు సిలువలో ఒంటరివాడిగా బాధననుభవించాడు. నీకొరకు మొత్తబడినవాడయ్యాడు. ఈనాడు నీవు శ్రమలతో బాధపడుతుంటే ఈ నామములో ప్రభువుని స్తుతించి, ప్రార్థించి, విడుదల పొందాలి.

## 372. దేవునివలన బాధింపబడినవాడు.

– యెషయా 53:4

**“నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడినవాని గాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి.”**– యెషయా 53:4

యేసుక్రీస్తు దేవునివలన బాధింపబడ్డాడు. మనము యథార్థమైన భక్తి కలిగి యున్నాము. కొన్నిసార్లు శ్రమలను నీ జీవితములో దేవుడు అనుమతిస్తాడు. రోగము కలిగినప్పుడు, శ్రమలో బాధను అనుభవిస్తున్నప్పుడు అందరూ నిన్ను తృణీకరిస్తారు. మనుష్యులవలన విసర్జింపబడతావు. నీకు వ్యక్తిగత సిలువగా దేవుడు అనారోగ్యత కలుగజేస్తే మనతో ఉండేవారే ఈ మాట అంటారు. ఏ పాపము చేశాడో దేవుడే ఇతనిని బాధిస్తున్నాడు. మొత్తుతున్నాడని అంటారు. దీంట్లో ఆశ్చర్యమేమీలేదు. మనకంటే ముందు ప్రభువు ఇలాంటి బాధలు భరించాడు. మొత్తబడినవాడు, దేవునివలన బాధింపబడినవాడు ఇవి ఆయన నామములే.

**“అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను.”** – యెషయా 53:10

ఈ వాక్యము నేనెప్పుడూ మరువలేను. జీవితాంతము నా హృదయములో ముద్రింపబడింది. ఈ మాట పరిశుద్ధగ్రంథములో ఉందనికూడా నాకు తెలియని రోజులలో 1985లో మొట్టమొదటిసారి మా నాన్నగారి నోటి నుండి విన్నాను. 1985వ సంవత్సరంలో నాలుగు సంవత్సరముల ప్రాయము గల నా ప్రథమ కుమార్తె హఠాత్తుగా చనిపోయింది. ఆ దుఃఖము భరించలేకపోయాను. నేను, నా భర్తగారు ఆ పరిస్థితి తట్టుకోలేకపోయాము. ఎంతగానో ప్రేమించి, అల్లారుముద్దుగా పెంచుకున్నాము. పాపే లోకముగా ఎంచుకున్నాము. ఒక సేవకుని కుమార్తెనైన నేను లోకమునే ఎక్కువగా ప్రేమించాను. ఎంతో ముద్దుగా చూడటానికి ఎంతో అందముగా ఉన్న ఆ పాపకు 'తార' అనే పేరు పెట్టుకొని సమయమంతా ఆమెతో గడిపేవారము. అంతగా ప్రేమించిన బిడ్డ హఠాత్ మరణము మమ్మును ఎంతగానో క్రుంగదీసింది. ఆ బిడ్డలేని జీవితము శూన్యముగా అన్పించి చనిపోవాలను కున్నాను. ఆ బిడ్డ జూన్12వ తారీఖు స్కూల్‌కు వెళ్ళాల్సి ఉండగా జూన్ 10వ తేదీ చనిపోయింది. ఆ బిడ్డ స్కూల్‌కు వెళ్ళడానికి కొన్న యూనిఫాం, షూస్, బ్యాగ్, బుక్స్, వాటర్ బాటిల్ ఇవన్ని కనబడుతుంటే దు:ఖము ఆగడము లేదు. పాప చనిపోయిన విషయము తెలియదు కనుక పాపకొరకు సిద్ధపరచిన రిక్షావాడు పాపను స్కూల్‌కు తీసుకువెళ్ళడానికి 12వ తారీఖు ఉదయముననే వచ్చాడు. నేను పాపను స్కూల్‌కు పంపడానికి చేసిన ఏర్పాట్లన్ని కళ్లముందే ఉన్నాయి. కాని పాప ఈలోకములో లేదు. పాప జ్ఞాపకాలు తలుచుకొని ఏడ్చి ఏడ్చి కన్నీరుకూడా ఇంకిపోయినది. చచ్చిన శవమువలె కుప్పలాగా పడియున్న నా దగ్గరకు మానాన్నగారు వచ్చారు. మా నాన్నకూడ బిడ్డను ఎంతగానో ప్రేమించాడు. అందరూ మా నాన్నగారితో – పాస్టర్ గారికి ఉన్న మనుమలు మనుమరాళ్లలో ఈ బిడ్డ ఎంతో అందముగా దేవుని దూతలాగ ఉందనేవారు. నేను డ్యూటీకి వెళ్లినప్పుడు పాపను అమ్మా నాన్నే చూసుకునేవారు. ఆ బిడ్డతో ఆడుకునేవారు. ఆ బిడ్డ మరణము మా నాన్న కూడ తట్టుకోలేకపోయాడు. నన్ను పరామర్శించడానికి వచ్చి **'నిన్ను నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను'** అనే ఒక్కమాట పలికి వెళ్లిపోయారు. ఆ మాట నా చెవుల్లో గింగురుమంటూ ఉంది. అది పరిశుద్ధగ్రంథములో ఉందనికూడ అప్పుడు నాకు తెలియదు. ఎందుకంటే దేవునికి బహుదూరముగా ఉన్నాను. నా కంటికి ఇంపైన దానిని దేవుడు ఒక్క దెబ్బతో తీసేశాడు. దేవుడు నన్ను మార్చడానికే నన్ను నలుగగొట్టాడు. నన్ను నలుగగొట్టి విరిచి ఆయన ప్రేమలో ఫలింపజేసి అనేకులకు ఆశీర్వాదముగా వాడుకుంటున్నాడు. ఒక బిడ్డను కోల్పోయాను. ఈనాడు వేలమంది యౌవన బిడ్డలు నన్ను అమ్మ, అమ్మ అని పిలుస్తున్నారు. దేవునికి స్తోత్రం కలుగును గాక.

ఈ రోజున దేవుడు నిన్ను నలుగగొడుతున్నాడా? దేవునివలన బాధింపబడు తున్నావంటే అది నిన్ను దీవించడానికే అని తెలిసికోవాలి. ఆనాడు సిలువలో ప్రభువు బాధింపబడ్డాడు. ఆయనను నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమయింది. అందుకే ఈనాడు మనము ఈ రక్షణానందము అనుభవిస్తున్నాము.

పౌలు భక్తుడు ఈ విధముగా అంటున్నాడు. వాక్యము ప్రకటించిన తరువాత భ్రష్టుడయిపోకుండ తన్నుతాను నలుగగొట్టుకుంటున్నానని అంటాడు.

**“గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుట లేదు గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచుకొనుచున్నాను.”** – 1 కొరింథీ. 9:27

దేవునివలన బాధింపబడటము దేవుని చిత్తమయితే దేవుని స్తుతించాలి. ఆయన బాధపెట్టినను తన కృపాసమృద్ధినిబట్టి జాలిపడతాడు. దేవుని చిత్తప్రకారము బాధ అనుభవించేవారు నమ్మకమైన సృష్టికర్తకు తన ఆత్మను అప్పగించుకోవాలి. యేసుప్రభువు సిలువలో మనకు అదే మాదిరి చూపాడు.

**"కాబట్టి దేవుని చిత్తప్రకారము బాధపడువారు సత్ ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను."**

– 1 పేతురు 4:19

మేలు చేసి కీడు అనుభవించడానికి మనము పిలువబడ్డామని పేతురు భక్తుడు అంటున్నాడు.

**"ఎవడైనను అన్యాయముగా శ్రమపొందుచు, దేవునిగూర్చిన మనస్సాక్షికలిగి, దుఃఖము సహించినయెడల అది హితమగును. తప్పిదమునకై దెబ్బలు తినినప్పుడు మీరు సహించినయెడల మీకేమి ఘనము? మేలుచేసి బాధపడునప్పుడు మీరు సహించినయెడల అది దేవునికి హితమగును; ఇందుకు మీరు పిలువబడితిరి. క్రీస్తుకూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను. మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి."**

– 1 పేతురు 2:19-24

ప్రియ విశ్వాసులారా మీరు దేవునివలన బాధ అనుభవిస్తున్నట్లయితే, మనుష్యులందరు మిమ్మును తృణీకరించి విసర్జించినట్లయితే భయపడకండి, కలత చెందకండి. మీ వ్యసనము, దుఃఖము ఆయనకు తెలియజేయాలి. ఆయన నీ కంటే ముందుగా దేవునివలన బాధింపబడ్డాడు. నీ బాధలు, దుఃఖము ఆయనకు తెలుసు. నిన్ను బాధలన్నిటినుండి విడిపించి, విమోచించడానికే ఆయన సిలువలో బాధ అనుభవించాడు. ఆయన నామములో ప్రార్థించి, విడుదల పొందాలి.

## 373. తల్లి

– యెషయా 66:13

**"ఒకని తల్లి వానిని ఆదరించునట్లు నేను మిమ్మును ఆదరించెదను. యెరూషలేములోనే మీరు ఆదరింపబడెదరు."** – యెషయా 66:13

దేవుని నామము **'తండ్రి'** అని మనందరికి తెలుసు. కాని ఈ రోజు **'తల్లి'** అను నామము వాక్యమునుండి నేర్చుకుంటున్నాము. దేవుని నామము 'తల్లి', ఎంత మంచి ఆదరణనిచ్చే నామము. తల్లిలేని వారికందరికి ఈ నామము శుభవార్త. దేవుడు తల్లివలె నిన్ను ప్రేమించి, ఆదరిస్తాడు. యెరూషలేములోనే మీరు ఆదరింపబడెదరు. దేవుని ప్రేమ తల్లి వంటిది. తల్లి ఎప్పుడూ తన బిడ్డలను కాపాడి, పోషించి సంరక్షిస్తుంది. ప్రేమిస్తుంది, గద్దిస్తుంది, ఆదరిస్తుంది. మనమందరము తల్లియొక్క స్వభావమును అనుభవించి తెలుసుకున్నవారమే. తల్లిలేనివారు ఎవరూ ఉండరు. తల్లి నీకు జన్మనిచ్చి నిన్ను ఈ లోకమునకు తీసుకువస్తుంది. శారీరకమైన తల్లి మనలను ఈ లోకములోకి తీసుకొని వచ్చి మధ్యలోనే విడిచి ఈలోకము నుండి దాటిపోతుంది. మనము జీవించినంత కాలము మనతో ఉండదు. కాని ఈ తల్లికి (దేవుడు) నీవు నీ తల్లి గర్భములో రూపింపబడక మునుపే నిన్ను గూర్చి సమస్తము తెలుసు. తల్లివలే నిన్ను ఆదరించి అంతమువరకు నిన్ను నడిపిస్తాడు. తల్లి ఎప్పుడు పిల్లల క్షేమము కోరుకుంటుంది. వారిని శ్రద్ధతో పోషించి సంరక్షిస్తుంది. తల్లి కడుపు చూస్తుంది; భార్య జేబు వెదుకుతుంది అనే సామెత మనము వింటూనే ఉంటాము. తల్లి పిల్లలను తిన్నావా? అని అడుగుతుంది. ఎంత మంచి ప్రశస్తమైన మాట. ఎవరైనా మనలను ఆ విధముగా పరామర్శిస్తే తినక పోయినా కడుపు నిండిపోయినంత భావన కలుగుతుంది. నా తల్లి బ్రతికియున్నప్పుడు ఎప్పుడు నన్ను చూడగానే అన్నము తిన్నావా? అని అడిగేది. ఆమె చనిపోయిన తరువాత ఏనాడు నీవు తిన్నావా? అని నన్నెడిగేవారు ఎవరూ లేరు. ఈ తల్లి (దేవుడు) మనకు శారీరకమైన, ఆత్మీయమైన ఆహారము అనుగ్రహించి మనలను పోషించి ఆదరించి నడుపుతుంది. తల్లివలే ప్రేమించి ఆదరించే దేవుడు మనకున్నాడు. దేవునికి స్తోత్రం! హల్లెలూయ!!

ఒక ప్రేయసి తన ప్రియునితో – నేను నీ ప్రేమను అంగీకరించాలంటే నీ తల్లి తలను నరికి ఒక పళ్లెములో పెట్టుకొని నా దగ్గరకు తీసికొనిరమ్మని అడిగిందట. నీవు ఆ విధముగా చేస్తేనే నేను నిన్ను వరిస్తాను లేదంటే నీ ప్రేమను త్యజిస్తాను అని అనగానే; ఆ ప్రియుడు తన ప్రియురాలి ప్రేమలో మునిగి గ్రుడ్డివాడైపోయాడు. తల్లి ప్రేమను మరచిపోయాడు. కనుక తల్లి కంటే ప్రియురాలే కావాలని తల్లి తలను తీసుకువచ్చి ప్రియురాలికి యివ్వాలని నిశ్చయించుకొన్నాడు. తల్లి మంచి నిద్రలో ఉన్నప్పుడు గొడ్డలితో తల్లి తలను నరికి, ఆ తలను ఒక పళ్లెములో పెట్టుకొని ప్రియురాలి దగ్గరకు వెళుతున్నాడు. మార్గము మధ్యలో కాలికి రాయి తగిలి తొట్రిల్లి పడిపోయాడు. పళ్లెము చేతిలోనుండి పడగానే తల్లి తలకూడ క్రింద పడిపోయింది. తల్లి కళ్లలో నుండి నీళ్లు కారుతున్నాయి. తల్లి స్వరము వింటున్నాడు. కుమారుడా, నీ కాలికి దెబ్బ తగిలిందా అని అడుగుతుంది. తల్లి ప్రేమ ఇలాగే ఉంటుంది. తన తల తెగిపోయిందనే బాధకంటే కుమారుని కాలికి దెబ్బ తగిలిందనే బాధే ఎక్కువగా ఉంది.

సిలువలో యేసుప్రభువు చూపినప్రేమ ఇలాంటిదే. సిలువలో నీకేదైనా గాయమైతే ప్రభువు సహించలేడు. గాయము చేయువాడు గాయము కట్టువాడు దేవుడే. గుండె చెదరినవారిని బాగుచేసి వారి గాయములు కట్టేవాడు. తల్లి వలే ఆదరించి ప్రేమిస్తాడు. మిమ్మును చంకను ఎత్తికొంటాడు. మోకాళ్ల మీద ఆడిస్తాడు. ఈ లోకరీతి తల్లి పిల్లలు పెద్దవగానే ఎత్తికుంటుందా? వయసు పైబడుతుంటే బరువు పెరిగిపోతుంటే మనలను ఎత్తికోలేదు. మోకాళ్లమీద ఆడించలేదు. శారీరకమైన తల్లికున్న శక్తి పరిమితమైనది. కాని దేవుని శక్తి అపరిమితమైనది. నీవు ఎంత ఎత్తు ఎదిగినా, ఎంత బరువు పెరిగినా నిన్ను ఎత్తికుంటాడు. మోకాళ్లమీద ఆడిస్తాడు.

**"మీరు చంకను ఎత్తికొనబడెదరు మోకాళ్లమీద ఆడింపబడెదరు."**

– యెషయా 66:12

నీకేదైనా అనారోగ్యత కలిగినపుడు, నీకు భయము సంభవించినప్పుడు వెంటనే ఈ తల్లి (దేవుడు) చంకను ఎత్తికుంటుంది. మోకాళ్లమీద ఆడిస్తుంది. నిన్ను వాక్యమనే పాలతో పోషిస్తుంది. తల్లివలే నేను మిమ్మును ఆదరిస్తానంటున్నాడు.

తల్లి (దేవుడు) పాడైన వాటినన్నిటిని బాగుచేస్తుంది. అది తల్లి స్వభావము. ఇంట్లో బట్టలు చినిగిపోతే కుడుతుంది. మరక పాత్రలను సరిచేస్తుంది. తల్లి పాడైనవాటిని మరమ్మతు (రిపేర్) చేసి బాగుచేసి తిరిగి వాడుతుంది. పాడైన నీ బ్రతుకును బాగుచేయడం దేవునికి సాధ్యము.

**"యెహోవా సీయోనును ఆదరించుచున్నాడు దాని పాడైన స్థలములన్నిటిని ఆదరించి దాని అరణ్యస్థలములను ఏదెనువలె చేయుచున్నాడు దాని యెడారి భూములు యెహోవా తోటవలె నగునట్లు చేయుచున్నాడు."**

– యెషయా 51:3

బిడ్డ తల్లి కడుపునుండి బయటకు రాగానే తల్లి రొమ్ములో పాలను త్రాగుతుంది. నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. అప్పుడే పుట్టిన చంటిబిడ్డకు తల్లి రొమ్ములో పాలు ఉంటాయనే జ్ఞానము ఎవరిచ్చారు? అవి త్రాగాలని, వాటిలో పోషక విలువలు ఉన్నాయనే సంగతి ఏలాగు తెలుసు? తల్లి రొమ్ములో ఉంది పాలే కాని విషముకాదనే విశ్వాసము ఎవరిచ్చారు. ఎంత ఆత్రుతగా పాలు త్రాగి తృప్తి చెందుతుంది. చంటి బిడ్డకు ఎంత విశ్వాసము. విశ్వాసులు కూడా ఇలాగే ఉండాలి. దేవునికి స్తోత్రం! హల్లెలూయ!!

దేవుని నామము 'తల్లి' అని ధ్యానిస్తున్నాము. చంటిబిడ్డ తల్లిని విశ్వసించినరీతిగా దేవునియందు సంపూర్ణ విశ్వాసము కలిగి యుండాలి.

తల్లిగా నీకిచ్చే పోషణను, భద్రతను, కాపుదలను విశ్వాసముతో పొందాలి. అవిశ్వాసమువలన దేవుడనుగ్రహించే ఆశీర్వాదములకు దూరము కాకూడదు. తల్లి ఒడిలో బిడ్డ ఉన్నట్లు విశ్వాసులు ఉండాలి. తల్లి ఒడిలోనున్న బిడ్డ ఎంత ధైర్యముగా ఉంటుందో గమనించారా? నా తల్లి నాతో ఉంది నాకింకేమి భయము లేదు అన్నట్లుగా ఉంటుంది. అలాగే విశ్వాసులు విశ్వాసముతో దేవుడు తోడుగా ఉన్నాడు, మాకింకేమి భయములేదు అని జీవించాలి. నీతిమంతుడు విశ్వాసము మూలముగా బ్రదుకుతాడు.

కోడిపెట్టను ఎప్పుడైనా చూశారా? అది ఎంత చిన్నగా ఉంటుంది. దాని తల మరీ చిన్నదిగా ఉంటుంది. తలలో మెదడు ఇంకెత చిన్నగా ఉంటుందో, కాని దానికెంత జ్ఞానమంటే శత్రువు బారినుండి తన పిల్లలను కాపాడుతుంది. గ్రద్దను చూడగానే తన రెక్కల క్రిందకు చేర్చుకొని రెక్కలతో పిల్లలను కప్పుతుంది. గ్రద్దకు కోడిపెట్ట కనపడుతుంది కాని కోడిపిల్లలు కనపడవు. కోడి తన పిల్లలను కాపాడినట్లు అనంతజ్ఞానియైన దేవుడు నిన్ను భద్రముగా కాపాడి సురక్షితముగా తన రెక్కల క్రిందకు చేర్చుకుంటాడు. సాతాను బారినుండి వేటకాని ఉరిలో నుండి నిన్ను రక్షిస్తాడు.

కొందరికి ఎప్పుడూ భయము, చింత. నా వృద్ధాప్యములో నన్నెవరు చూస్తారు? నేను అనారోగ్యతతో పడక పడితే నన్ను ఎవరు చూస్తారు? అని చింతిస్తూ ఉంటారు. నీవు రేపటిని గురించి చింతించే అవసరము లేదు. ఏనాటి కీడు ఆనాటికి చాలు. తల్లివలే నిన్ను చంక నెత్తుకొని మోకాళ్లమీద ఆడించి, ఆదరించే దేవుడు నీకు తోడుగా ఉన్నాడు. పుట్టిన బిడ్డకు తల్లి రొమ్ములో పాలను భద్రపరిస్తే; అంతమువరకు నిన్ను పోషించి సంరక్షించగలడు. ఆయన ఈ లోకములో నీకు కావలసిన సమస్తమును సిద్ధపరచగలడు. తల్లివలే ప్రేమించి, ఆదరించి కాపాడుతాడు. ఈ రోజు నిన్ను చంకనెత్తుకొని ఆడిస్తే నీ వృద్ధాప్యములో చేయలేడా? దేవుడు ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొని నడిపిస్తాడు. ఆయన చేయలేని ఏ కార్యము లేదు. అవిశ్వాసమువలన భయపడుతుంటాము. పరిమితమైన శక్తిగల శారీరకమైన తల్లిని గమనిస్తేనే పిల్లలకొరకు ఎంతో ప్రయాసపడుతుంది. శ్రద్ధతో వారి బాగోగులు చూస్తుంది. శ్రేష్ఠమైన ఆశీర్వాదములు పిల్లల కివ్వడానికి తన శాయశక్తుల కృషి చేస్తుంది. అపరిమితమైన శక్తిగల దేవుడు ఇంకెంతగా నీయందు శ్రద్ధ గలిగియుంటాడు. తల్లివలే ఆదరించి పోషించి సంరక్షిస్తాడు. పక్షులను గమనిస్తే తల్లిపక్షి గూటిలో ఉన్న చిన్న చిన్న పిల్ల పక్షులకు ఆహారము ఏ విధముగా అందిస్తుందో చూశారా? తల్లి పక్షి వెళ్లి పురుగులను ఏరుకొని నోటితో పట్టుకొని అది మింగకుండా తెచ్చి తన బిడ్డల నోటిలో పెడుతుంది. తల్లికి స్వార్థముండదు. తను తినకపోయినా తన బిడ్డల కడుపు నింపాలని ఆశిస్తుంది. తల్లిపక్షి ఆహారముతో రాగానే పిల్లపక్షి నోరు పెద్దగా తెరచి ఆహారము అందుకుంటుంది. ఆహారము తిని రెక్కలు, ఈకలు బలముగా తయారయి తల్లివలె మారిపోతుంది.

విశ్వాసులమైన మనము పరిశుద్ధ గ్రంథములో తల్లియైన దేవుడు సిద్ధపరచిన వాక్యమనే జీవాహారము భుజించి దిన దినము ఆయన కృపలో ఎదగాలి. ఆయన సారూప్యములోకి మలచబడాలి.

కంగారు అనే జంతువును ఎప్పుడైనా చూశారా? దానిని చూస్తుంటే ఇంకా చూడాలనిపిస్తుంది. దేవుడెంత చక్కగా దానిని సృష్టించాడంటే దాని పొట్ట క్రింద ఒక బ్యాగ్ లాంటిది ఉంటుంది. దానిలో దాని పిల్లలు కూర్చొని ఉంటాయి. ఆ బ్యాగ్‌లో పిల్లలు సురక్షితముగా హుందాగా కూర్చొని నిర్భయముగా అటు ఇటు చూస్తుంటాయి. విశ్వాసులమైన మనము దేవునిలో ఉంటేనే భద్రత ఉంటుంది. శత్రువైన సాతాను నిన్ను ముట్టడు. ఎందుకంటే దేవుడు తల్లివలె నిన్ను సురక్షితముగా కాపాడి ఆయన రెక్కలతో నిన్ను కప్పి భద్రపరుస్తాడు. తల్లివలే ఆదరించి ప్రేమించే దేవుడు. తల్లిప్రేమ కావాలంటే ఈ నామమెత్తి ప్రార్థించు. ఒక రోజు ఉదయ కాలములో నాకు కొద్దిగా బాధ కలిగింది. అప్పుడు వెంటనే నా తల్లి గుర్తుకు వచ్చింది. పరిశుద్ధ గ్రంథము తీసుకొని వాక్యము ధ్యానిస్తుంటే దేవుడు నాకీ నామము బయలుపరచాడు. బిడ్డా, నీవు భయపడకు దిగులు పడకు. నేనే నీ తల్లిని. తల్లివలె నేను నిన్ను ఆదరిస్తాను అని అభయమిచ్చాడు. తల్లికి బిడ్డలు ఎన్ని సంగతులు తెలియజేసినా సహనముతో వింటుంది. పిల్లలకొరకు ఎన్ని బాధలైనా పడుతుంది. ఏ కష్టమైన ఓర్చుకుంటుంది. దేవుడు ప్రతి వ్యక్తి వెనుక ఉండలేడు కాబట్టి దేవుని స్థానములో తల్లిని సృజించాడని అంటారు. తల్లిని దేవునితో సమానముగా భావిస్తాము. అట్టి తల్లి కూడ కొన్ని సార్లు తన పిల్లలను మరచిపోతుంది. కాని నీ దేవుడు నిన్ను ఏనాడు మరువడు. మరణము వరకు సదా కాలము నీకు తోడుగా ఉండి నడిపిస్తాడు. కొన్నిసార్లు వార్తా పత్రికలలో చదువుతాము. కన్నతల్లి పిల్లలకు విషము ఇచ్చి చంపివేసిందని, కొంత మంది అప్పుడే పుట్టిన చంటి బిడ్డలను ఎటువంటి దయ లేకుండా హాస్పిటల్‌లో అనాథలుగా వదిలి వెళ్లిపోతుంటారని, కొంత మంది చంటిబిడ్డలను చెత్తకుండీలలో పడవేస్తారు. ఎంత ఘోరము! వారు ఏదో పాపము చేసి అక్రమ సంబంధమువలన పుట్టిన బిడ్డలను తమ బిడ్డలని చెప్పలేక లోకానికి భయపడి నిర్దయగా, చంటిబిడ్డలను చెత్తకుండీలలో పడవేస్తారు. కాని 'తల్లి' అనే నామము గలిగిన మన దేవుడు నిన్ను ఏనాడు ఒంటరిగా విడువడు, మరచిపోడు. నిన్ను విడవడు ఎడబాయడు. తల్లి గర్భములో పిండాకృతిగా ఉన్నప్పుడే ఆయన కన్నులు నిన్ను చూశాయి. పుట్టిన దినము మొదలుకొని చనిపోయే వరకు నీకు తోడైయుండి తల్లివలె నిన్ను ఆదరిస్తాడు.

**"అయితే సీయోను - యెహోవా నన్ను విడిచిపెట్టియున్నాడు. ప్రభువు నన్ను మరచియున్నాడని అనుకొనుచున్నది. స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కియున్నాను. నీ ప్రాకారములు నిత్యము నాయెదుట నున్నవి."** - యెషయా 49:14-16

తల్లి లేనివారు, తల్లి ఉండి ప్రేమను పొందనివారు, తల్లి ప్రేమ కొరకు తల్లడిల్లేవారు దేవుని **'తల్లి'** అనే నామముతో స్తుతించి, తల్లివలే ఆదరించే దేవా, నాకు నీ ప్రేమ, ఆదరణ, నెమ్మది, కాపుదల దయచేయుమని ప్రార్థించాలి. నా శ్రమ దినమున, నేను క్రుంగిన వేళలో నన్ను నీ చంకనెత్తుకొని ఓదార్చుమని, మోకాళ్ల మీద ఆడించమని ప్రార్థించు. తప్పకుండ దేవుని ఆదరణ అనుభవిస్తావు. ❀


## UPF Bank Account Details

### Union Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **133911100000946** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **UBIN0813397** |

### State Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **67088374386** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **SBIN0012917** |

**చెక్కులు : United Peoples Fellowship**
**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**
**(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)**
**Phone Pe / G Pay : 7901236907**
**POS : Card Swipe**

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 170. "తట్టుడి, మీకు తీయబడును." - మత్తయి 7:7

తట్టుడి తీయబడునని దేవుని వాగ్దానము. తట్టు ప్రతివానికి తీయబడుతుంది. దేవుని ద్వారము దగ్గర నిలబడి తట్టాలి. నీవు ఒక స్నేహితుడి ఇంటికి వెళ్లావు. తలుపులు వేసియున్నవి. లోపల వారున్నారు. వారు నీ స్నేహితులే మాది 30 సం॥ల స్నేహబంధమని చెప్పి తలుపు తట్టకుండ తలుపుయొద్ద నిలుచుంటే తలుపులు తెరచుకుంటాయా? నీవు తలుపు తట్టినప్పుడే తలుపులు తెరచి నీ స్నేహితుడు నిన్ను లోపలికి ఆహ్వానిస్తాడు. అలాగుననే దేవుని ద్వారముయొద్ద మనము తడుతున్నప్పుడు దేవుడు మనకు ద్వారము తెరచి కావలసినవన్నియు అనుగ్రహిస్తాడు. తలుపు తట్టడములోకూడ చాలా రకములుంటాయని నేను గమనించాను. మన యింటికి పనిమనిషి వస్తే తలుపు మెల్లగా తడుతుంది. కానీ నీ కుమారుడు తడితే అధికారముతో తట్టుతాడు. ఆ తట్టడములోనే తెలిసిపోతుంది తలుపు బయట ఉన్నది ఎవరోయని. మనము దేవుని కుమారులము కుమార్తెలము దేవుని పిల్లలమయితే క్రీస్తుతోడి వారసులము. దేవుని దగ్గర మనకు ఎలాంటి అధికారమున్నదో తెలిసికొని ధైర్యముతో ఆయన కృపాసనము సమీపించాలి. మరల భయపడుటకు మనము దాస్యమనే కాడిక్రిందలేము కాని కుమారత్వపు హక్కును పొందాము. మనకు కావలసినవన్నియు మన పరలోకపుతండ్రిని అడిగినప్పుడు ఆయన నీకు సమస్తమును అనుగ్రహిస్తాడు.

**"మరియు ఆయన వారితో ఇట్లనెను - మీలో ఎవనికైన ఒక స్నేహితుడుండగా అతడు అర్థరాత్రివేళ ఆ స్నేహితుని యొద్దకు వెళ్లి - స్నేహితుడా, నాకు మూడు రొట్టెలు బదులిమ్ము; నా స్నేహితుడు ప్రయాణము చేయుచు మార్గములో నా యొద్దకు వచ్చియున్నాడు; అతనికి పెట్టుటకు నా యొద్ద ఏమియు లేదని అతనితో చెప్పినయెడల అతడు లోపలనేయుండి - నన్ను తొందరపెట్టవద్దు; తలుపు వేసి యున్నది, నా చిన్నపిల్లలు నాతోకూడ పండుకొనియున్నారు. నేను లేచి ఇయ్యలేనని చెప్పునా? అతడు తన స్నేహితుడైనందున లేచి ఇయ్యకపోయినను, అతడు సిగ్గుమాలి మాటిమాటికి అడుగుటవలనైనను లేచి అతనికి కావలసినవన్నియు ఇచ్చును అని మీతో చెప్పుచున్నాను. అటువలె మీరును అడుగుడి, మీ కియ్యబడును; వెదకుడి, మీకు దొరకును; తట్టుడి, మీకు తీయబడును, అడుగు ప్రతివానికియ్యబడును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడునని మీతో చెప్పుచున్నాను."** - లూకా 11:5-10

మధ్యరాత్రివేళ ఒక స్నేహితుడి ఇంటి తలుపు తట్టాలంటే ఇద్దరి మధ్యలో ఎంతగా ప్రగాఢమైన బంధముండాలి. మధ్య రాత్రివేళ మీరు నాకు ఫోన్ చేయడానికి భయపడతారు. కాని మీకు నాతో సన్నిహిత అనుబంధము ఉంటే ఎంత రాత్రివేళ ఫోన్ చేసినా నేను ఫోన్ లిఫ్ట్ చేస్తానని ఎంతో ధైర్యముగా కాల్ చేస్తారు. ఈ స్నేహితుడు మధ్యరాత్రి వేళ తన స్నేహితుడి తలుపు అధికారముతో తడుతున్నాడు. అతడు తన స్నేహితుడైనందున అతనికి కావలసినవన్నియు ఇయ్యక పోయినను అతడు మాటిమాటికి సిగ్గుమాలి అడుగుతున్నందుకు లేచి అతనికి కావలసినవన్నియు ఇస్తాడు. మనముకూడ మన దేవునియొద్ద మాటి మాటికి అడగాలి. సిగ్గుమాలి అడగాలి. మనము పొందేవరకు అడగాలి. ఈ స్నేహితుడు అడిగినది మూడు రొట్టెలు కాని కావలసినదంతయు పొందాడు. మన దేవుడు అడుగువాటికంటెను ఊహించువాటికంటెను అత్యధికముగా అనుగ్రహిస్తాడు.

నాకు 30 ఎకరముల స్థలము కావాలని దేవుని అడుగుతున్నాను. మందిర నిర్మాణముకొరకు సంఘకార్యక్రమములకొరకు స్థలము కావాలని ప్రార్థిస్తున్నాను. మా పాప చెరిల్ నాతో - మమ్మీ, నీవు 30 ఎకరములు కావాలని అడుగుతున్నావు. గొప్పవాటిని అడుగు. వంద ఎకరములు కావాలని ప్రార్థించినా దేవుడు తన సేవ నిమిత్తము యు.పి.ఎఫ్.కు అనుగ్రహిస్తాడని నాతో అంటుంది. మన మంచి స్నేహితుడు యేసుప్రభువు. నీవు ఏ మధ్యరాత్రివేళ ఈ స్నేహితుడి తలుపు తట్టినా నీకు ద్వారము తెరువబడుతుంది. నీవు శ్రమలలో భయభీతులలో ఉన్నప్పుడు, నీవు తట్టుకోలేని పరిస్థితులలో ఉన్నప్పుడు ఏ రాత్రి అయినా తలుపు తట్టినా నీకు కావలసినవన్నియు నీకు అనుగ్రహిస్తాడు. నీకొరకు ప్రాణము పెట్టిన నిజస్నేహితుడు ఆయన ప్రాణముతో పాటు నీకు సమస్తమును అనుగ్రహిస్తాడు. కాబట్టి అడుగుడి, మీ కియ్యబడును; వెదకుడి, మీకు దొరకును; తట్టుడి మీకు తీయబడును. దేవునికి స్తోత్రము.

## 171. "మీ దేవుడైన యెహోవాను అనుసరించిన యెడల మీకు క్షేమము కలుగును." - 1 సమూ 12:14

మీరు మీ దేవుడైన యెహోవాను అనుసరించినయెడల మీకు క్షేమము కలుగుతుందని దేవుని గొప్ప వాగ్దానము. ప్రపంచములో ఎప్పుడూ నీ యెదుట రెండు మార్గములుంటాయి. ఆశీర్వాదము శాపము; మేలు కీడు; జీవము మరణము. ఏ మార్గములో నడుచుకోవాలో దేవుడు నిన్ను బలవంతము చేయడు. ఎన్నుకొనే బాధ్యత నీదే. మేలైనది క్షేమకరమైనది నీతి న్యాయములు కలిగిన దేవుని మార్గమును ఎంచుకొని ఆయన ఆజ్ఞలు కట్టడలు అనుసరిస్తూ నడచుకుంటే నీకు క్షేమము కలుగుతుంది. లేదు నేను అటు ఇటు ఉంటానని అనుకుంటే దేవుని నోటినుండి ఉమ్మివేయ బడతావు. ఉత్తమమైన మార్గము ఎంచుకొనే స్వేచ్ఛను దేవుడు నీకే ఇచ్చాడు కాబట్టి ఉత్తమమైన మార్గమేదో కనిపెట్టి అందులో నడచుకోవాలి. జీవమార్గమునందు నడవాలి. నీ దేవుడైన యెహోవాను అనుసరిస్తే నీకు క్షేమము కలుగుతుంది. క్షేమము కలుగాలని ప్రతి ఒక్కరికి ఆశ. కుటుంబము బాగుపడాలని, ఆశీర్వదింపబడాలని, భార్యాబిడ్డలు క్షేమముగా ఉండాలని, ఏ తెగులు నీ గుడారము సమీపించకూడదని, ఆకస్మిక అపాయములు కలుగకుండ కాపాడబడాలని, చేయుచున్న ఉద్యోగములలో వ్యాపారములలో అభివృద్ధి పొందాలని ప్రతి ఒక్కరు ఆశిస్తారు. నీ ఆశలన్నియు నెరవేరాలంటే నీకు క్షేమము కలుగాలంటే నీ దేవుడైన యెహోవాను అనుసరించాలి. దేవుని ప్రతి వాగ్దానము నెరవేరడానికి కొన్ని షరతులుంటాయి. ఈ వాగ్దానమునకు షరతు ఏమిటంటే వ్యర్థమైనవాటిని అనుసరించకుండ దేవుని అనుసరించాలి.

**"వ్యర్థమైన వాటిని అనుసరించువాడు బుద్ధిలేనివాడు."** - సామెతలు 12:11

శ్రేష్ఠమైనవి, మాన్యమైనవి దేవుని ప్రణాళికలో ఉన్నవాటినే అనుసరించాలి. యేసుప్రభువు శిష్యులను వెంబడించమన్నప్పుడు వారి వలలు విడిచిపెట్టి తనను వెంబడించమన్నాడు. పరిశుద్ధమైన దేవుని మార్గములో నడువడానికి, ఆయనను అనుసరించాలంటే నీలోనున్న పాపమును విడిచి పెట్టాలి. దేవునితట్టు తిరగాలి. మీరు నా తట్టు తిరిగితే నేను మీతట్టు తిరుగుతానని దేవుడు సెలవిస్తున్నాడు. నేనైతే దేవుని సన్నిధిలో ఏ నకిలీ చెల్లదని నేర్చుకున్నాను, అందుకే బాగుపడ్డాను. దేవుడు నన్ను నా కుటుంబమును సంఘమును అంచలంచలుగా ఆశీర్వదిస్తూ అభివృద్ధి నొందించాడు. దేవుని సన్నిధిలో ఏ వంకరమార్గము చెల్లదు. డాంబికులు అబద్ధీకులు ఆయన సన్నిధిలో నిలువలేరు. I can be this, I can be that అంటే దేవుని సన్నిధిలో కుదరదని నేర్చుకున్నాను. గుడిలోనేమో భక్తి, ఇంట్లోనేమో నీ ఇష్టానుసారముగా ప్రవర్తిస్తావు. ప్రార్థన

చేస్తూనే పాపము చేస్తావు. నీ ద్రవ్యమును వడ్డీకిస్తానంటే కుదురుతుందా? వెయ్యిరూపాయలకు పది రూపాయలు వడ్డీనట. వడ్డీ ఇచ్చేవారు నిన్ను ఎంతగా తిట్టుకుంటూ శపిస్తూ ఇస్తారో నీకు తెలుసా? నీవు కూడబెట్టిన సొమ్మంతా ఒక్క క్షణములో పోగొట్టుకుంటావు జాగ్రత్త. లోభులు ఆయనకు అసహ్యులు లోకాశలుగల లోతు చూపులకు లోబడితే హానికరము. లోకమంతయు సంపాదించుకొని నీ ప్రాణము విడిచిన ఫలితమేమని పాట ఉంది. వ్యర్థమైనవాటిని అనుసరించువాడు బుద్ధిలేనివాడు. దేవుని యందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలము. దేవుడిని అనుసరించాలి. ఆయన ఆజ్ఞలయందు ఆనందించాలి. దేవుని వాక్యము దివారాత్రులు ధ్యానించాలి. నీతిన్యాయములను అనుసరిస్తూ యథార్థమైన ప్రవర్తన కలిగి జీవించాలి. దేవునికి విరోధమైన ప్రతి పాపమును విడిచిపెట్టాలి. సాతాను తంత్రములను ఎదిరించాలి. ఈ విధముగా నీవు నీ దేవుడైన యెహోవాను అనుసరించినయెడల నీకు క్షేమము కలుగుతుంది. నీ భక్తి నీకు ధైర్యము పుట్టిస్తుంది. నీ మనవులు దేవుడు అంగీకరిస్తాడు అనే ధైర్యముతో దేవుని కృపాసనము సమీపిస్తావు. తల్లిదండ్రులను ఏదైనా అడగాలంటే ఎవరికి ఎక్కువ ధైర్యము ఉంటుందంటే తల్లిదండ్రుల మాటకు విధేయులై వారు చెప్పినట్లు నడచుకొనేవారికే. నాకు ఇద్దరు కుమారులున్నారు. రెండవ కుమారుడు వాళ్ల డాడీ చెప్పినట్లు వింటాడు కాబట్టి వాడికి ఏ అవసరత ఉన్నా వెంటనే వాళ్ల డాడీని ధైర్యముగా అడుగుతాడు. వాళ్ల డాడీ అది వాడికిస్తాడు. కానీ పెద్దకుమారుడికి ఏది కావాలన్నా నా దగ్గరకు వచ్చి - మమ్మీ నాకు అది కావాలని డాడీతో చెప్పు అంటాడు. నా ద్వారా తనకు కావలసినవేవో తండ్రికి తెలియజేస్తాడు. తండ్రి మాటకు విధేయులై తండ్రి చిత్తము నెరవేర్చేవారికి తండ్రి తమ ప్రార్థనలు ఆలకించి తప్పకుండ జవాబును అనుగ్రహిస్తాడనే ధైర్యము నిశ్చయత కలిగిఉంటారు.

గతములో జరిగిన ఒక అద్భుతము మీకు తెలియజేస్తున్నాను. ఒక ప్రసంగము క్యాసెట్ రిలీజ్ చేయాలంటే కొన్ని వేల రూపాయలు కావాలి, ఎక్కడ నుండి వస్తాయని నేను మనస్సులో అనుకుంటూ ప్రార్థన చేశాను. దేవా, నీవు గొప్ప దేవుడవు కదా, అద్భుతములు చేయువాడవు, నాకు ఇప్పుడు 20,000 రూ॥లు అర్జెంట్‌గా కావాలి. నీవు నాకు దయచేయమని ప్రార్థించి మందిరములో కూర్చున్నాను. ఒక కుటుంబము మందిరమునకు వచ్చి - అమ్మా, మాకు ఒక భూమి అమ్మడములో లాభము వచ్చింది. ఇదిగో 20,000 రూపాయలు కృతజ్ఞత కానుకగా దేవునికి అర్పించడానికి వచ్చామని అన్నారు. దేవునికి స్తోత్రము. నాకు కావలసింది నేను అడిగిన వెంటనే దేవుడు అద్భుతము చేశాడు. దేవునికి స్తోత్రము. దేవుని అనుసరించేవారికి క్షేమము కలుగుతుంది. ఆయన అద్భుతకరుడు, ఆశ్చర్యకరుడు. ఆయన నీయెడల ఆశ్చర్యకార్యములు జరిగిస్తాడు. దేవుని అనుసరించేవారు దేవుడు వారి మనవులు అంగీకరిస్తాడనే గొప్ప ధైర్యము కలిగియుంటారు. ప్రసంగముల క్యాసెట్స్ విడుదల అయితే లోకమంతా క్షేమము కలుగుతుంది. దేవుని వాక్యము వెల్లడి అగుటతోడనే చీకటిలో వెలుగు కలుగుతుంది. ఎన్నో గృహాలు కట్టబడతాయి. విరిగి నలిగిన హృదయములకు ఆదరణ కలుగుతుంది. జీవితములో ఎదురయ్యే సమస్యలకు ఒడిదుడుకులు తట్టుకోలేక ఆత్మహత్య చేసికొని చనిపోవాలను కొనేవారు వాక్యము విని ఆత్మహత్య తలంపుల నుండి విడిపింపబడి జీవమార్గములో నడుచుకుంటారు. ఇరుకులలో ఇబ్బందులలో శ్రమలలో ఉన్నవారికి దేవుని వాక్యము ఆదరణ నెమ్మది ధైర్యమునిస్తుంది. ఒక వ్యక్తి రక్షింపబడి దేవుని వెంబడిస్తే అతనిద్వారా వేలాదిమంది ప్రభువుతట్టు ఆకర్షితులవుతారు. దేవునికి స్తోత్రము. హల్లెలూయ. యెహోవాను అనుసరించేవారికి క్షేమము కలుగుతుంది. ❀

## యూత్ సండే సెలబ్రేషన్స్

యు.పి.ఎఫ్ ఆధ్వర్యంలో 2023 నవంబరు 12వ తేది ఆదివారము సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లిలో జయకరంగా జరిగింది.

యౌవనస్థులందరు స్తుతి ఆరాధనలో పాల్గొని కొరియోస్, స్కిట్స్ ద్వారా దేవుని నామమును మహిమ పరిచారు.

## వరల్డ్ సండే స్కూల్ సెలబ్రేషన్స్

యు.పి.ఎఫ్. ఆధ్వర్యంలో 2023 నవంబరు 5వ తేది ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లిలో జయకరంగా జరిగింది.

సండే స్కూల్ పిల్లలందరు స్తుతి ఆరాధనలో పాల్గొని కొరియోస్, స్కిట్స్, కంఠత వాక్యములను చెప్పారు. సిస్టర్ రెబెకా రాజ్ గారు దేవుని వాక్యమును అందించారు. అలాగే సిస్టర్ మేరీ సుచరిత గారు చేసిన పప్పెట్ షో ద్వారా దేవుని వాక్యమును విన్న చిన్నారులందరు వారు అడిగిన ప్రశ్నలన్నింటికి జవాబులు చెప్పి బహుమతులను గెలుపొందారు.

జాయ్ చెరియన్ అమ్మగారు, చెరియన్ అయ్యగారు సెలబ్రేషన్‌లో పాల్గొని సండే స్కూల్ టీచర్స్‌ని, చిన్నారులందరిని ప్రోత్సహించి వారి కొరకు ప్రార్థన చేశారు.

## ఉమెన్స్ సండే సెలబ్రేషన్స్

యు.పి.ఎఫ్ ఆధ్వర్యంలో 2023 నవంబరు 19వ తేది ఆదివారము సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లిలో జయకరంగా జరిగింది.

రెవ॥డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు "దేవుడు మరియు స్త్రీ" అనే వర్తమానమును అందించారు.

ఉమెన్స్ అందరు స్తుతి ఆరాధనలో పాల్గొని కొరియోస్, స్కిట్స్, బైబిల్ క్యారెక్టర్స్, దేవుడు మరియు స్త్రీ అనే అంశముపై క్లుప్త సందేశాలు, స్పెషల్ సాంగ్స్ పాడి దేవున్ని మహిమపరిచారు.

## వార్షిక కృతజ్ఞత ఆదివారము సెలబ్రేషన్స్

యు.పి.ఎఫ్ ఆధ్వర్యంలో 2023 నవంబరు 26వ తేది ఆదివారము సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లిలో జయకరంగా జరిగింది.

రెవ॥డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు "ఏడు రకముల స్తుతి" అనే వర్తమానమును అందించారు.

ఈ సెలబ్రేషన్స్‌లో యు.పి.ఎఫ్. ప్రతి విభాగంలోని వారు మరియు సండే స్కూల్ చిన్నారులందరు పాల్గొని దేవున్ని స్తుతించి మహిమ పరిచారు.

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 241. "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి."

– యాకోబు 1:22

ఇప్పుడు టి.వి. ద్వారా లక్షలాది ప్రజలు వాక్యం వింటున్నారు. కాని వినడం కన్నా గైకొని దాని ప్రకారం ప్రవర్తించడం ఎంతో శ్రేష్ఠమైందని గ్రహించాలి. పరిశుద్ధ గ్రంథములో ప్రభువు చెప్పిన ఒక ఉపమానములో విత్తువాడు విత్తనములు విత్తుతున్నాడు. కొన్ని విత్తనములు ముళ్ల పొదల్లో పడుతున్నాయి; ఐహిక విచారములు, ధనాపేక్ష అనేవి ఆ విత్తనములను అణచివేస్తున్నాయి. కొన్ని బండమీద పడుతున్నాయి; అవి వేరు తన్ననందున ఎండకు మాడిపోతున్నాయి. కొన్ని త్రోవ ప్రక్కన పడుతున్నాయి; వాటిని పక్షులు ఎత్తికొనిపోతున్నాయి. మంచి నేలను పడిన విత్తనాలు నూరంతలుగా, అరవదంతలుగా, ముప్పదంతలుగా ఫలిస్తున్నాయి (మత్తయి 13వ అధ్యాయం). నీవు నీ హృదయమనే నేలను సేద్యపరచుకొని సిద్ధము చేసికొని ఉంటే వాక్యము నీలో నాటుకున్నప్పుడు మంచి నేలను పడిన విత్తనమువలె నూరంతలుగా ఫలిస్తావు. వాక్యము విత్తనం వంటిది; జీవము గలది. అది ఫలించి నిన్ను దీవిస్తుంది. కావున మీరు వినువారుగానే ఉండి మిమ్మును మోసపుచ్చుకోకుండా వాక్యప్రకారం ప్రవర్తించాలి. మనల్ని రూపాంతరపరచేది; మన మనస్సులను మార్చేది దేవుని వాక్యము తప్ప మరేమి లేదు. వాక్యము చాకలివాని సబ్బు వంటిది. అది నీలో ఉన్న మచ్చలు, మరకలు, కల్మషమును తొలగిస్తుంది. నీ చిత్తవృత్తి అంతా నూతనపరచబడుతుంది. ప్రాచీన స్వభావము వదలిపోతుంది. దేవుని పోలికగా సృష్టింపబడిన మనము నవీన స్వభావమును ధరించుకుంటాము. కావున నీవు ఎప్పుడూ దేవుని వాక్యాన్ని ఆలక్ష్యం చెయ్యొద్దు. వాక్యమంటే దేవుడు. **"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను."** – యోహాను 1:1

## 242. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థనచేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను."

– యాకోబు 5:13

ఎవరికైనా శ్రమ కలిగినప్పుడు అంతవరకు ప్రార్థన స్వభావం లేనివారుకూడా ప్రార్థిస్తారు; మందిరమునకు రానివారుకూడా పరుగెత్తుకొని మందిరమునకు వచ్చి ప్రార్థన సహకారం కోరుతారు. అవును, నీకు శ్రమ వస్తే నీవు ప్రార్థన చేయాలి. అప్పుడు దేవుడు నీ మొఱ్ఱ ఆలకించి నీకు జవాబిస్తాడు. నీకు శ్రమ కలిగినప్పుడు నీవు చతికిలబడడం, నిరుత్సాహ పడడం, ధైర్యము కోల్పోవడం దేవుని చిత్తము కాదు. ఆత్మహత్య చేసికోవడం అసలే సరికాదు. నీకు శ్రమ కలిగితే వెంటనే మోకరించి దేవుని సన్నిధిలో ఆయనకు నీ మనవులు, శ్రమ తెలియజేయాలి. నీ పాపములు ఏవైనా అడ్డుగా ఉంటే ఒప్పుకొని వదిలిపెట్టాలి. అప్పుడు దేవుని కనికరం నీమీద ఉంటుంది. దేవుడు నిన్ను క్షమిస్తాడు. నీకు సమాధానమునిస్తాడు. నీ శ్రమల్లో తోడుగా ఉంటాడు. నీ ప్రార్థనకు జవాబు ఇస్తాడు. నీ కార్యాన్ని సఫలం చేస్తాడు. సింహపు బోనులో దానియేలు మొఱ్ఱపెట్టాడు. అగ్ని మధ్యలో షద్రక్, మేషాక్, అబేద్నెగోలు దేవుని సన్నిధిని అనుభవించారు. దేవుడు వారి ప్రార్థన ఆలకించి శ్రమల్లో విడుదల దయచేశాడు. కావున నీకు శ్రమ కలిగినప్పుడు భయపడక దేవుని ఆశ్రయించాలి. శ్రమల్లో దేవుడు నీకు సహాయకుడిగా ఉంటాడు.

**"మీలో ఎవడైనను రోగియైయున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింపవలెను; వారు ప్రభువు నామమున అతనికి నూనె రాచి అతనికొరకు ప్రార్థనచేయవలెను. విశ్వాస సహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును, ప్రభువు అతని లేపును; అతడు పాపములు చేసినవాడైతే పాపక్షమాపణ నొందును."** – యాకోబు 5:14,15. శ్రమల్లో దేవుని సహాయం కోరి ప్రార్థించినప్పుడు ఇటువంటి అద్భుతకార్యాలు జరుగుతాయి. శ్రమల్లో ప్రార్థన కోరాలి. వారు నూనె రాచి ప్రార్థించాలి. వారిలో, నూనెలో శక్తి లేదుగాని దేవునిలోనే శక్తి ఉంది. వారు దేవుని నామంలో ప్రార్థిస్తున్నారు కాబట్టి ఆ నామంలో ప్రతి కట్టు, రోగం విడుదల పొందుతుంది. ప్రభువు పేరట చేసే కార్యాలకు శక్తి ఉంటుంది. ప్రభువులో ఉన్న మహిమ భక్తులద్వారా ఇతరులకు ప్రవహిస్తుంది. 'వాల్టేర్' అనే నాస్తికుడు తన శ్రమల్లో 'దేవుడు లేడేమో గాని నాకు ఈ శ్రమల్లో దేవుడు అవసరం' అని అంటాడు. కావున శ్రమల్లో మనకు దేవుడు ఎంతో అవసరం. శ్రమల్లో ప్రార్థిస్తే దేవుని ఆశీర్వాదాలు, విడుదల, స్వస్థత అనుభవిస్తాము.

మీలో ఎవరికైనా సంతోషం కలిగితే పాటలు పాడాలి. ప్రతి విషయంలో దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. సీయోను నివాసులారా, నేను వచ్చి మీ మధ్య నివాసము చేతును; సంతోషముగా పాటలు పాడుడి; ఇది యెహోవా వాక్కు అని వాక్యం తెలియజేస్తుంది. సంతోషంతో పాటలు పాడినప్పుడు దేవుడు గగనము చీల్చుకొని మీ మధ్యకు వచ్చేస్తాడు. పాటలు దేవునికి మహిమ కలుగజేస్తాయి. నీవు శ్రమల్లో మొఱ్ఱపెట్టినప్పుడు దేవుడు విని నీ ప్రార్థనకు జవాబిస్తాడు. ఆ జవాబు రాగానే నీ హృదయం స్తుతులతో నింపబడి నీ నోటినుండి పాట రావాలి. ప్రార్థన, స్తుతి అనేవి సాతానును ఓడించుటకుగల గొప్ప ఆయుధాలు. సాతాను చెయ్యలేని కార్యాలు నీవు చేసినప్పుడు నీకు సాతానుపై అధికారం, జయం కలుగుతుంది.

## 243. "సహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదుమని తెలిసికొని మీలోఅనేకులు బోధకులు కాకుండుడి."

– యాకోబు 3:1

బోధకులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఈ ఆదేశము బోధిస్తుంది. బోధకులకు కఠినమైన తీర్పు ఉంటుంది. చాలామంది బోధించడం ఒక ఘనతవహించిన కార్యమని తలంచి బోధకుల స్థానానికి రావాలని ఎంతో ఆశిస్తుంటారు. దైవవాక్కులు ప్రకటించుటకు దేవుడు కొందరిని పిలిచి, అభిషేకించి, నియమించుకుంటాడు. అప్పుడు వారు బోధిస్తుంటారు. అది దేవుడు వారికిచ్చిన వరము. వారిని సేవకొరకు నిర్ణయించుకున్నాడు కాబట్టి వారితో ఎప్పుడూ మాట్లాడుతుంటాడు. వారిని కడిగి పవిత్రపరుస్తుంటాడు. ఆ స్థానంలోకి రావాలని ఆశించడం తప్పుకాదు. ఎందుకంటే దేవుడే

సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త అందించమన్నాడు. కాని ఇది ఒక మామూలు విషయం కాదని సువార్త అందించే నీవు తెలిసికోవాలి. దైవికమైన జ్ఞానాన్ని పొంది ఇతరులకు సన్మార్గాన్ని బోధించే నీవు సక్రమమైన మార్గంలో లేకుంటే; బోధించేదాన్ని నీవు అమలు చేయకుంటే నవ్వులపాలౌతావు. నీకు కఠినమైన తీర్పు ఉంటుంది. బోధకులు చాలా పవిత్రంగా ఉండాలి. బోధించేవాటిని నీవు ఆచరించువాడవై ఉండాలి. అది బోధకుల బాధ్యత.

**"ఎదుటివానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా? వ్యభిచరింపవద్దని చెప్పు నీవు వ్యభిచరించెదవా? విగ్రహములను అసహ్యించుకొను నీవు గుళ్లను దోచెదవా? ధర్మశాస్త్రమందు అతిశయించు నీవు ధర్మశాస్త్రము మీరుటవలన దేవుని అవమానపరచెదవా? వ్రాయబడిన ప్రకారము మిమ్మునుబట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది?"** – రోమా 2:21-24. శాంతి, శాంతి అంటూ నీలో శాంతి లేకుంటే; సమాధానమని చెబుతూ నీవు ఇతరులతో సమాధానాన్ని కలిగి ఉండకుంటే; శత్రువులను ప్రేమించాలని పగ సాధిస్తుంటే; బాధించినా నోరు తెరవవద్దని నీవే కలహమును రేపుతుంటే అన్యజనుల మధ్య దేవుని నామం దూషింపబడుతుంది. కావున బోధకుల స్థానంలో ఉండాలంటే నీకు అభిషేకం, పవిత్రత ఉండాలి. నీవు అన్నీ గ్రహించి తెలిసి తెలిసి తప్పు చేస్తే, యెరిగి యెరిగి చెడిపోతే శిక్షకూడా కఠినంగా ఉంటుంది. యూదుల మతాచారంలో బోధకులంటే చాలా గౌరవం. కావున పరిసయ్యులు, సద్దూకయ్యులు, శాస్త్రులు బోధకుల స్థానంలోకి రావాలని, బోధకులని పిలవబడుటకు చాలా ఆశించేవారు. **"శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు గనుక – వారు మీతో చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియలచొప్పున చేయకుడి; వారు చెప్పుదురే గాని చేయరు. మోయ శక్యముకాని భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజములమీద వారు పెట్టుదురేగాని తమ వ్రేలితోనైన వాటిని కదలింపనొల్లరు. మనుష్యులకు కనబడు నిమిత్తము తమ పనులన్నియు చేయుదురు; తమ రక్షరేకులు వెడల్పుగాను తమ చెంగులు పెద్దవిగాను చేయుదురు; విందులలో అగ్రస్థానములను సమాజ మందిరములలో అగ్రపీఠములను సంత వీధులలో వందనములను మనుష్యులచేత బోధకులని పిలువబడుటయు కోరుదురు."** – మత్తయి 23:2-7. వారి అంతరంగములో సత్యము లేదు, శుద్ధిలేదుగాని మనుష్యులకు కనబడాలని కార్యాలు చేస్తారు. వారు పేరు, గౌరవం కావాలని ఆశిస్తారు. అట్టి ఆశంతా చెడ్డది. దేవుడు నిలబెడితే ఆత్మతో నింపి నిలబెట్టి వాడుకుంటాడు. ఆయన నిలువబెట్టుటకు శక్తిగలవాడు. ప్రార్థనపూర్వకంగా దైవభయంతో కార్యాలు చేయాలి. పవిత్రమైనకార్యాలు, ఆత్మకార్యాలు ఎక్కడ జరుగుతాయో, ఎవరు ధనాపేక్ష లేకుండా సేవ జరిగిస్తారో దేవుడు అట్టి సేవలను దీవిస్తాడు.

## 244. "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరుగుడి." – యాకోబు 1:2

మన విశ్వాసానికి పరీక్ష వస్తుంది. దేవుడు నీ విశ్వాసాన్ని పరీక్షించునప్పుడు నిన్ను ఏ మాత్రము అనాథగా విడువడు. శ్రమల్లో నీకు తోడుగా ఉంటాడు. ఆ శ్రమ, పరీక్షద్వారా నీకు అనేకమైన ఆశీర్వాదాలను అనుగ్రహిస్తాడు. అందుకే ఈ శ్రమలు, పరీక్షలద్వారా నీవు అనేక కార్యాలను నేర్చుకుంటావు. దేవునికి దగ్గరౌతావు. నీ సామర్థ్యం, సహనం పెరిగిపోతుంది. నీ విశ్వాసమునకు కలుగు పరీక్షద్వారా ఓర్పు కలుగుతుంది. నీకు కలిగే శ్రమల్లో ఆశీర్వాదాలెన్నో ఇమిడియున్నాయి గనుక నీవు నానావిధములైన శ్రమల్లో పడునప్పుడు అలసిపోకుండా, విసిగిపోకుండా, నీరసించిపోకుండా మహానందమని భావించాలి. **"...మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి."** – యాకోబు 1:3. నీకు శ్రమ కలిగినప్పుడు నిరీక్షణ కలిగి సంతోషించాలి. శ్రమల్లో ఓర్పు, ప్రార్థనలో పట్టుదల కలిగియుండాలి. **"నిరీక్షణగలవారై సంతోషించుచు, శ్రమయందు ఓర్పుగలవారై, ప్రార్థనయందు పట్టుదల కలిగియుండుడి."** – రోమా 12:12

**"శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని యెరిగి శ్రమలయందును అతిశయపడుదము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవునిప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది."** – రోమా 5:3-5

## 245. "మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి." – యాకోబు 1:4

మన పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మనము పరిపూర్ణులుగా ఉండాలని ప్రభువు కోరుతున్నాడు. ఈ పరిపూర్ణత, పరిపక్వత నీకు రావాలంటే శ్రమలద్వారానే వస్తుంది. దానికి వేరే మార్గమే లేదు. మీరు సంపూర్ణులు, అనూనాంగులు కావాలని దేవుడు మిమ్మును శ్రమలగుండా తీసికొని వెళ్తాడు. మీకు దేనివిషయంలోను కొదువ లేకుండా ఉండాలనేది దేవుని చిత్తము. శ్రమలద్వారా ఓర్పు అనే ఆశీర్వాదము వస్తుంది. కావున ఓర్పు తన క్రియను కొనసాగింపనియ్యాలి. నీవు ఈ శ్రమల తర్వాత శుద్ధ సువర్ణమువలె తయారౌతావు. నశించిపోయే సువర్ణమునకే అగ్నిపరీక్ష అవసరము. కాబట్టి దేవుడు శ్రమలద్వారా నీ అమూల్యమైన విశ్వాసాన్ని మెరుగుపెడతాడు. నిన్ను మెరుగుపెట్టిన అంబువలె తయారుచేస్తాడు. నీవు శ్రమలద్వారా ఎన్నో పాఠములు నేర్చుకుంటావు. కావున శ్రమల్లో ఆనందించాలి. 'కోడిగుడ్డు ఓర్చుకుంటే పట్టెడు అవుతుంది' అనే సామెత ఉంది. ఆ కోడి గుడ్డు 21 రోజులు కోడి క్రింద ఓర్చుకొని ఉంటే ఆ సహనంలో కార్యం జరుగుతుంది. అందులో జీవం ఉంది కాబట్టి 21 రోజులు రాగానే ఆ గుడ్డు పక్షి రూపంలోకి వచ్చేస్తుంది. అలాగే శ్రమలు పొందినవారిని చూడగానే తెలిసిపోతుంది. వారిలో సాధువైన, మృదువైన గుణాలు స్పష్టంగా కనబడతాయి. ఎందుకంటే వారు శ్రమలద్వారా పదునుచేయబడ్డారు. కాబట్టి ఎవరైనా నిన్ను బాధిస్తే, కఠినంగా మాట్లాడి నీ హృదయాన్ని గాయపరిస్తే నీలో ఈ సంపూర్ణత రావాలి. అలాంటివారిని సహించి వెంటనే మన్నించాలి. వారికొరకు ప్రార్థించాలి. తిరిగి వారితో కలహించకుండ ఆ బాధలోకూడా నీ ఓర్పు, సహనాన్ని కాపాడుకోవాలి. అలా చేస్తే శ్రమలద్వారా నీవు ప్రభువులో పొందిన వృద్ధి బయల్పరచ బడుతుంది. శ్రమ లేకుంటే ఫలం ఉండదు. కావున క్రైస్తవ జీవితంలో శ్రమలు అనుభవించుటను నీవొక అలవాటుగా చేసికోవాలి. నేను దైవచిత్తంలో ఉన్నాను; దేవుడు నాకొరకు అనేకమైన దీవెనలు దాచివుంచాడు; నన్ను ఫలభరితంగా, సమర్థవంతంగా చేస్తాడు; శ్రమల్లో నేను నాశనం కాను; దేవుని చిత్తమే నా జీవితంలో బయల్పరచబడుతుందనే విశ్వాసంతో ముందుకు సాగాలని ఈ ఆదేశముయొక్క భావము. ❀

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. సుస్మిత, రాంనగర్:** నేను డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాను. కాలేజి ఈవెంట్స్‌కొరకు పరుగు సాధన చేస్తున్నప్పుడు నా రెండు కాళ్లు నొప్పివలన పూర్తిగా నడవలేని పరిస్థితికి వచ్చాను. నా వ్యక్తిగత పనులు చేసికోవడంకూడా చాలా యిబ్బందికరంగా మారింది. సహాయం లేకుండా ఏ పని చేసికోలేకపోయాను. బాత్రూమ్‌కి వెళ్లినా నా తల్లి సహాయం తీసికొంటూ వృద్ధులకంటే దారుణమైన పరిస్థితికి చేరాను. నేను యు.పి.ఎఫ్. సంఘానికి క్రమంగా వస్తాను. తెలుగు క్వయర్‌లో పాటలు పాడుతాను. ఒక ఆదివారం యూత్ సండేకొరకు రెండు రోజును డాన్స్ సాధన చేశాను. తర్వాతకూడా నాకు ఈలాగే జరిగి నాకాళ్లు పనిచేయలేదు. మా కొరియోగ్రాఫర్ నన్ను డాన్స్ చెయ్యొద్దన్నారు. కాని నేను చేస్తానని చెప్పి ప్రార్థన చేసికొని డాన్స్ చేశాను. డాన్స్ చేసి వేదికమీదనుండి దిగిన తర్వాతకూడా నేను బాగానే ఉన్నాను. కాని ఇంటికి వెళ్లాక నా కాళ్లు అస్సలు పని చేయలేదు. ఈ రెండు సందర్భాల్లోకూడా నేను అమ్మగారికి ఫోను చేసి ప్రార్థన చేయించుకున్న తర్వాత నాకు విడుదల కలిగింది. మరియ నేను నా తండ్రి చెప్పినట్లు – “ఎండిన యెముకలకు జీవమిచ్చువాడు” అనే దేవుని నామము ధ్యానిస్తూ వ్రాస్తున్న సమయంలో సంపూర్ణ స్వస్థత పొందాను. మూడు రోజుల్లో ఈ నామము వెయ్యిసార్లు వ్రాశాను. అమ్మగారు సంఘం నాకొరకు ప్రార్థించారు. దేవుడు నన్ను స్వస్థపరచాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**2. షాజిని మాథ్యూస్, బెంగళూరు:** నేను 11.08.2023న అమ్మగారు చెప్పిన దేవుడు న్యాయము తీర్చడా? అనే వర్తమానము విన్నాను. చాలా బలపరచబడ్డాను. ఈ వాక్యము దేవుడు నాకొరకే సిద్ధపరచి అమ్మగారి నోటినుండి బయలుపరచాడని నేను నమ్ముతున్నాను. అమ్మగారు చేసిన ప్రార్థన, పాడినపాట హెచ్చరించిన వాక్యము, విసుకక ప్రార్థిస్తే దేవుడు న్యాయం తీర్చడా అని చెప్పిన మాటలన్నీ నా విశ్వాసాన్ని అధికం చేసినవి. 3.10.22న నేను అనుకోకుండా కంపెనీలో ఉద్యోగం మానేశాను. ఆ రోజు సాయంత్రము మీటింగ్‌లో ఉండగా నేను కంపెనీనుండి వచ్చేయడం జరిగింది. వెనుక వాళ్ల కుట్ర, రికార్డింగ్‌లు ఏవేవో చేసి నామీద ఫిర్యాదు చేసి యున్నారు. అప్పటినుండి నేను ఇంట్లోకూడా ఎవరికి ఏమీ చెప్పలేదు కాని ప్రార్థన, ఉపవాసము చేస్తూనే ఉన్నాను. 3 అక్టోబర్ 22 నుండి ఇప్పటికీ ప్రార్థిస్తూనే ఉన్నాను. ఇంత ప్రార్థన చేస్తున్నా దేవుడు జవాబివ్వడం లేదని అనుకొన్నాను. ఏడు రోజులు నీరు మాత్రమే త్రాగుతూ ఎడతెగక ప్రార్థించాను, అలాగే 40 రోజులు, 21 రోజులు ఉపవసిస్తూ వీలుకుదిరినప్పుడెల్లా ఉపవసిస్తూ ప్రార్థనలో ఉన్నాను కాని దేవుడు మార్గము తెరవలేదు. దేవుడు నాకు విరోధి అయ్యాడా అని అమ్మగారు చెప్పినట్లు నాలో అలజడి కలిగినప్పుడెల్లా నేను నా ప్రాణముతో హెచ్చరించుకొని ఆ మాటలన్నీ చదివి నేను నెమ్మది పొందియున్నాను. అయితే దేవుడు 11.8.23న అమ్మగారి వర్తమానంద్వారా నాతో మాట్లాడాడు. 10.8.23న ఓ సహోదరుడు ఫోన్ చేసి అమ్మో, మీరు కాబట్టి ఇన్ని రోజులు ఓపిక పట్టారు. మీలాగా ఎవరు ఉండలేరు, అందరు డిప్రెషన్‌లోకి వెళ్లిపోతారు. నేను బయటకు వచ్చి 11.8.23కి 318 రోజులు. నేను – నా ప్రార్థన, నా దేవుడు నాకు బలమని చెప్పాను. అదే వర్తమానముతో 11.8.23న అమ్మగారు నన్ను బలపరచారు. అమ్మగారు మాట్లాడుతుంటే నా కళ్లలోనుండి నీళ్లు కారుతూనే ఉన్నాయి. దేవుడు ప్రత్యక్షంగా నాతోనే మాట్లాడుతున్నాడని నాకు చాలా ధైర్యం కలిగింది. ఆ రోజు అమ్మగారు చెప్పిన “యెహోవా నీతిక్రియలను జరిగించుచు బాధింపబడువారికందరికి న్యాయము తీర్చును.” – కీర్తనలు 103:6 అనే వాగ్దానము వ్రాయ మొదలు పెట్టాను. నేను ఎవ్వరి దగ్గర ఏ సహాయం ఆశించలేదు. నాకు ఉన్న సేవింగ్స్‌తో 318 రోజులు జరిగినవి. ఇప్పుడు అంతా తరిగిపోయినను నేను విశ్వాసమునుండి తప్పిపోకుండునట్లు అమ్మగారిద్వారా జవాబు దొరికినందుకు సంతోషము, ఆనందము కలిగినది. దేవుడు నాకొరకు సిద్ధపరచిన వాక్యముకై దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు తెలుపుచున్నాను.

**3. నీరజ:** నేను 21 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్. సంఘానికి వస్తున్నాను. అమ్మగారు చేసే ప్రార్థనలద్వారా నేను అనేకమైన మేళ్లు పొందాను. రెండు సంవత్సరాల క్రితం మీరందరూ మా కుటుంబం గురించి ఎంతగానో ప్రార్థన చేశారు. ముఖ్యంగా నా భర్త అజిత్ కుమార్ గారి కోసం. కాని ఆయన ప్రభువు సన్నిధికి చేరుకున్నారు. మేము క్రొత్తగా ఫ్లాట్‌లోకి వెళ్లాము. అక్కడ క్రిస్టియన్ ఫ్యామిలి ఒక్కటే ఉంది. ఆవిడ వేరే చర్చికి వెళ్తుంది. 22 జులై 2023న అమ్మగారు మా గృహంలో ప్రారంభించిన కల్వరి ప్రేయర్ సెల్‌కి వస్తుంది. నేను గతనెలలో (ఆగస్టు) ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాను. అయినా ప్రార్థన నిలిపివేయకూడదని నేనూ, మా పాప ఆసుపత్రిలో బెడ్ మీదే ప్రార్థన చేసుకున్నాము. ఈ ప్రార్థనలవలన నేను ఎంతగానో బలపడుతున్నాను. శరీర అనారోగ్యతవలన నేను క్రమంగా చర్చికి రాకపోయినప్పటికి ఆదివారం మాత్రం తప్పక దేవుని సన్నిదికి వస్తాను. ఈ జూమ్ మీటింగ్‌వలన, ప్రేయర్ సెల్స్‌వలన, అమ్మగారి వాక్యమువలన నేనెంతగానో బలపడుతున్నాను. అమ్మగారి విజన్ ఎంతో గొప్పగా ఉంటుంది. నేను ఈ 21 సంగరాలు అమ్మగారి నోటనుండి వచ్చే ప్రతి మాట వింటున్నాను. దాన్ని అనుసరిస్తున్నాను. డెంగ్యూతో బాగా మోషన్స్, హై ఫీవర్‌తో నేను ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాను. నా కొరకు సంఘము ప్రార్థన చేశారు. మరి ముఖ్యంగా అమ్మగారు, పాస్టర్లు అందరూ నా కొరకు ప్రార్థన చేశారు. దేవునికి స్తోత్రములు. మీకు వందనాలు.

**4. సంపూర్ణ, ఎల్.బి. నగర్:** నా భర్త ప్రసాద్ పీటర్‌కి ఉపిరితిత్తుల్లో సమస్య ఉందన్నారు. అప్పటినుండి దానిగురించే సంఘము ప్రార్థన చేస్తున్నారు. అమ్మగారు వచ్చి ప్రార్థించి మందులకు సహాయం చేశారు. అలాగే మీరు రోజూ 7 పాటలు పాడి చక్కగా వాక్యం ధ్యానించి దేవుని స్తుతించమని చెప్పారు. ఆ రోజునుండి 7 పాటలు పాడి నామములు, వాగ్దానాలు, జీవపు మాటలు చదివి 2 గంటలపాటు దేవున్ని ఆరాధిస్తున్నాము. దేవుడెన్ని అపాయాలనుండి ప్రసాద్ పీటర్‌ని విడిపించాడో! మీరందరూ ప్రార్థన చేశారు. అమ్మగారు అయితే ఉపవాసప్రార్థన చేశారు. దేవుడు ఎంతో నెమ్మదిని స్వస్థతని ఇచ్చాడు. దేవునికి స్తోత్రములు. దైవసేవకులకు అందరికీ వందనాలు.

**5. జెస్సీ మనోహర్, అత్తాపూర్:** నేను రిలయన్స్‌లో కస్టమర్ రిలేషన్ మేనేజరుగా పనిచేస్తున్నాను. అప్పటినుండి దేవుని సన్నిధిని చాలా మిస్ అవుతున్నాను. అమ్మగారు చెప్పిన వాక్యాలను పది సంవత్సరాలుగా వింటున్నాను. అమ్మగారు కుటుంబ ప్రాముఖ్యత, జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టుకుంటుంది, కట్టుకోడానికి దేవుని సహాయం కోరాలి అని, కుటుంబ పోషణ ఎలా చేయాలి? భర్త పిల్లలను ఎలా చూసికోవాలి? స్త్రీ దేవునిలో ఎలా బలపడాలి? అనే ప్రసంగాలద్వారా నేను చాలా బలపడ్డాను. అమ్మగారు వ్రాసిన వెయ్యి నామములుకూడా నేను 2008వ సం॥ నుండి క్రమం తప్పకుండ ధానిస్తున్నాను. నేను వెయ్యి నామములవల్లనే ఇంతవరకు ఆరోగ్యకరంగా ఉన్నాను. నా వివాహం కాక ముందునుండే ధ్యానిస్తున్నాను. వివాహమైన తర్వాతకూడా నా కుటుంబమంతా వాగ్దానాలు, ఆదేశాలుద్వారా బలపరచబడి దేవుని సన్నిధిలో సమయం గడపటానికి దేవుడు కృప చూపిస్తున్నాడు. అమ్మగారికి నేను చిన్న వాట్సప్ మెసేజి పెట్టగానే జులై 25వ తేదీన మా గృహములో “ఎస్తేరు ప్రేయర్ సెల్” ని ప్రారంభించడానికి

యు.పి.ఎఫ్. పాస్టర్లందరూ వచ్చారు. అమ్మగారికి ధన్యవాదములు. నేను ఎప్పుడూ అమ్మగారిని వ్యక్తిగతంగా చూడలేదు. మొదటిసారిగా కుటుంబముతో అమ్మగారిని కలవటానికి దేవుడు కృప చూపించాడు. అందునుబట్టి దేవునికి స్తోత్రములు.

**6. ప్రశాంత్:** నేను 2023, జులై నెలలో వైరల్ ఫీవర్‌తో బాధపడటంవల్ల ఆసుపత్రిలో అడ్మిట్ కావలసి వచ్చింది. ఆత్మీయ తల్లి జాయ్ అమ్మగారు నాకు ఫోన్ చేసి ఎంతో ధైర్యపరచారు. అమ్మగారు ప్రార్థన చేసిన ఒక్కరోజులోనే సంపూర్ణ స్వస్థత పొందాను. ఒక్క రోజులోనే దేవుడు నన్ను స్వస్థపరచినందుకు దేవాది దేవునికి నా కృతజ్ఞతలు. జాయ్ అమ్మగారికి మరియు యు.పి.ఎఫ్. సంఘ సభ్యులకు నా వందనాలు.

2023లో నారాయణగూడ బాప్టిస్టు చర్చిలో జరుగుతున్న యు.పి.ఎఫ్. సిలువ ధ్యానములకు ఉ॥ 5 గం॥లకు బైక్ మీద బయలుదేరాను. మధ్యలో ముషీరాబాద్ వద్ద ప్రమాదానికి గురయ్యాను. ఆ సమయంలో హెల్మెట్‌కూడా లేదు. వేగంగా పడి 100 మీటర్ల వరకు ఈడ్వబడ్డాను. చిన్న దెబ్బలు తగిలాయి. దేవుడు గొప్ప అపాయంనుండి రక్షించాడు. నా గురించి ప్రార్థించిన అమ్మగారికి 24×7 నిరంతర ప్రార్థన వీరులకు వందనాలు. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లునుగాక.

**7. రాజు:** నేను రెండు సంవత్సరాల క్రితం బాగా త్రాగేవాడిని. దగ్గుతుంటే రక్తపువాంతులు వచ్చేవి. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ఎన్నో ఆసుపత్రుల చుట్టూ తిరిగాను. డబ్బులేకుంటే అమ్మ అప్పుచేసి ఆసుపత్రి ఖర్చులకు ఇచ్చేది. చివరికి మేము గాంధీ ఆసుపత్రికి వెళ్లాము. అక్కడి డాక్టరు అన్ని పరీక్షలు చేసి నీవెలా బ్రతికి ఉన్నావు. నీ లివర్, కిడ్నీస్ అన్నీ పాడైపోయాయి. నీవెలా బ్రదికి ఉన్నావో మాకే అర్థం కావడం లేదు అన్నారు. అప్పుడు నేనుకూడా నా జీవితం మీద ఆశ వదులుకున్నాను ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నాను. మా అమ్మ యు.పి.ఎఫ్. సంఘానికి 25 సం॥ల నుండి వెళ్తుంది. మా అమ్మ అక్కడ ప్రేయర్ వారియర్. నేను 6 నెలల వరకు పడక మీదే ఉన్నాను. ఏమీ తినేవాడిని కాదు. కేవలం జ్యూస్‌లు మాత్రమే తీసికొనేవాడిని. చాలా చిక్కిపోయాను. అలాంటి పరిస్థితిలో మా అమ్మ జాయ్ అమ్మగారి దగ్గరకు వెళ్లి నా పరిస్థితి గురించి చెప్పారు. అప్పుడు అమ్మగారు వెంటనే ఫోన్ చేసి ప్రార్థన చేశారు. అమ్మగారు ప్రార్థన చేసి ఇచ్చిన ప్రార్థన నూనె మరుసటిరోజు ప్రార్థన చేసికొని త్రాగాను. త్రాగిన 5 నిమిషాలకి నా శరీరం నుండి నల్లని పొగ నిరంతరంగా 5 నిమిషాలు వచ్చింది. అలాగే నా శరీరంనుండి కొన్ని పురుగులు బయటికెళ్లాయి. అప్పుడు నా శరీరం అంతా మారిపోయి మునుపటి శక్తిని పొందాను. నా గురించి ప్రార్థించిన జాయ్ అమ్మగారికి, యు.పి.ఎఫ్. సభ్యులకందరికీ నా ప్రత్యేక వందనాలు. సమస్త మహిమ దేవునికే చెల్లునుగాక.

**8. శాంతి:** మేము కేవలము అమ్మగారి ప్రార్థనలద్వారా బ్రదుకుతున్నాము, దేవునిలో నిలబడుతున్నాము. దేవుడు నా జీవితంలో ఎన్నో అద్భుతాలు చేశాడు. నేను అనారోగ్యత నిరాశలో ఉన్నప్పుడు అమ్మగారి ప్రార్థనలు వాక్యము నన్నెంతగానో బలపరచాయి. నా కుమారుని పేరు మున్నా. ఇటీవల అతనికి జ్వరము, జలుబు, దగ్గు వచ్చాయి. మేము మామూలు జ్వరమే అనుకున్నాము. తర్వాత తీవ్రత పెరిగితే ఆసుపత్రికి తీసికెళ్లాము. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడని డాక్టర్ చెప్పారు. నేను వెంటనే యు.పి.ఎఫ్.కి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం ఇచ్చాను. అమ్మగారు ప్రార్థన చేసిన వెంటనే జ్వరం తగ్గిపోయింది. దేవుని మహా కృపనుబట్టి నా కుమారుడు సంపూర్ణ స్వస్థత పొంది ఆసుపత్రినుండి డిశ్చార్జి అయ్యాడు. ప్రార్థించిన జాయ్ అమ్మగారికి, ప్రేయర్ వారియర్స్‌కి, పాస్టర్లకు నా ప్రత్యేక వందనాలు. సమస్త ఘనత, మహిమ దేవునికే చెల్లునుగాక.

**9. ఎస్తేల సిల్వియా:** నేను యు.పి.ఎఫ్. సంఘములో 24/7 నిరంతర ప్రార్థనలో జూమ్ లీడర్‌గా పని చేస్తున్నాను. నేను ఉ॥ 7 గం॥ల నుండి 9 గం॥ల వరకు ప్రార్థనను జరిపించాలి. ఒకరోజు ఉ॥ 11.30 ని॥లకు నాకు పరీక్ష ఉంది. అయితే ఒక రోజు ముందే రేపు పరీక్ష ఉంది అందుకని నేను జూమ్‌ని నడుపలేను అనుకున్నాను. కాని దేవుడు నాతో మాట్లాడాడు. నీవు నా పని చేయి, నా పని చేస్తే నేను నీ పనులన్నిటిలో ఆశీర్వదిస్తాను అని. అప్పుడు నేను ఎలాంటి పరిస్థితిలో అయినా ఆపకుండా జూమ్‌ను నడిపించిన తర్వాత పరీక్ష వ్రాయాలని ఆ రోజు ఉ॥ 5:30కి లేచి ఒక రివిజన్ పూర్తి చేశాను. జూమ్ నడిపిన తర్వాత రెండో రివిజన్ పూర్తి చేశాను. 3 గం॥ల పరీక్ష పేపర్‌ని గంటన్నరలోనే ఎంతో అద్భుతంగా పూర్తిచేశాను. దేవుడే నాకు తోడుగా ఉండి నా చేయి పట్టుకొని పరీక్ష వ్రాయడానికి సహాయం చేశాడు. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక.

**10. శారద, గుంటూరు:** నా భర్త పేరు ప్రేమాయయుడు. నా భర్త ప్రైవేటు కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. నేను కరోనా సమయంనుండి జూమ్‌లో జాయిన్ అయి ప్రార్థనలో పాల్గొంటున్నాను. 2021 నుండి నా భర్తకి గవర్నమెంట్ ఉద్యోగంకొరకు ప్రార్థన కోరాను. నా భర్త పది ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీకి ఐదుసార్లు అటెండ్ అయ్యాడు. ఒక్కసారికూడ ఉద్యోగంలో విజయం పొందలేదు. కారణం ఏమిటంటే అక్కడ డబ్బులు ఆశిస్తున్నారు అని వేరే వ్యక్తిద్వారా తెలిసింది. లంచం అనే మాట వినబడకూడదని మరింత పట్టుదలతో దేవునికి ప్రార్థన చేస్తూ సంఘాన్ని ప్రార్థన కోరుతూ ఉన్నాను. జాయ్ చెరియన్ అమ్మగారు ఎన్నో మార్లు ప్రార్థించారు. ఆ తర్వాత అసోం సెంట్రల్ యూనివర్సిటి, తేజ్‌పూర్ యూనివర్సిటి, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలకు అటెండ్ అయ్యాడు. అమ్మగారు రెండు సంవత్సరాల క్రితం ఒక సహోదరికి ఒక వాగ్దానము ఇచ్చారు. **"దిట్టమైనచోట మేకు కొట్టినట్టు నేను అతని స్థిరపరచెదను. అతడు తన పితరుల కుటుంబమునకు మాన్యతగల సింహాసనముగా నుండును."**

– యెషయా 22:23

ఈ వాగ్దానం నన్ను చాలా బలపరచింది. అప్పటినుండి ఆ వాగ్దానం వ్రాస్తూ ప్రార్థిస్తున్నాను. సంఘంలో ఎంతో భారంగా ప్రార్థన చేసేవారు. 2023, మే నెలలో తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటర్వ్యూకి అటెండ్ అయ్యాడు. మూడు నాలుగు నెలలు ఎదురుచూశాడు. తమిళనాడు యూనివర్సిటీలో ఉద్యోగం వస్తుందని చాలా ఆశపడ్డాడు. కాని వారు ఏమీ జవాబు ఇవ్వలేదు. వారు టెంపరరి నోటిఫికేషన్‌కూడా ఇచ్చారంట. ఎందుకంటే సరిపోయిన వ్యక్తి ఈ ఉద్యోగానికి లేరని, మరల వేరొక వ్యక్తిని రిక్రూట్ చేసికోడానికి నోటిఫికేషన్ ఇచ్చారు.

దేవుడు ఒక గొప్ప అద్భుతం చేశాడు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ వారు నా భర్తకి ఇ-మెయిల్ ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్ పంపించారు. నా భర్తకి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగమిస్తున్నట్లు 21-11-2023న ఇ-మెయిల్‌లో తెలియజేశారు. నేను దేవునికి కృతజ్ఞత చెల్లిస్తున్నాను. ఏవిధమైన డబ్బులు కట్టకుండా, ఎవరి రికమండేషన్ లేకుండా ఈ ఉద్యోగం దేవుడిచ్చాడు. ప్రార్థించిన సంఘమంతటికి జాయ్ చెరియన్ అమ్మగారికి నా వందనములు. నా గృహంలో దేవుని మందసం, ఒలీవ ప్రేయర్ సెల్ ఇచ్చినందుకు దేవునికి వందనాలు. ఇంత గొప్ప అవకాశం, నిరంతర ప్రార్థన, వాగ్దానాలు ఎత్తి ప్రార్థించడం ప్రేయర్ సెల్ వీటన్నిటిద్వారా నేను ఆత్మీయంగా చాలా బలపడుతున్నాను. వీటన్నిటినిబట్టి అమ్మగారికి నా వందనములు. నా సాక్ష్యంద్వారా దేవుడు మహిమ పొందాలని నా ఆశ. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లును గాక!


యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (UPF)
యు.పి.ఎఫ్. క్రిస్మస్
క్రిస్మస్ ఆరాధన
వాచ్‌నైట్ సర్వీస్
HAPPY NEW YEAR 2024
నూతన సంవత్సర ఆరాధన
కృతజ్ఞత కూడిక
ఫ్యామిలీ రిట్రీట్
Also live on

# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

1) **"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** — **వెల రూ. 150/- (each one)**
   1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
2) **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** — **వెల రూ. 150/-**
   1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
3) **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** — **వెల రూ. 150/- (each one)**
   1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
4) **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **వెల రూ. 150/-**
5) **"అద్భుత కార్యములు" - Vol - I to IV** — **వెల రూ. 150/- (each one)**
6) **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) — **వెల రూ. 150/-**
7) **"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**
8) **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**
9) **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) **వెల రూ.20/-**
10) **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 20/-**
11) **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**
12) **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**
13) **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) **వెల రూ. 20/-**
14) **"తల్లి ఒప్పుకోలు" పుస్తకము** (తెలుగు) **వెల రూ. 20/-**
15) **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 20/-**
16) **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 20/-**
17) **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**
18) **"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**
19) **"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లీషు మరియు తెలుగు) **వెల రూ. 10/-**
20) **"నూతన సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లీషు) **వెల రూ. 60/-**

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** – దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 31 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎస్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 31 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు–**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** – సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

## United Peoples Fellowship Trust Building Fund Account

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 630501062130** **Bank : ICICI - Himayat Nagar Branch** **IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



# యు.పి.ఎఫ్. కార్యక్రమాలు

1. **ఆదివారము ప్రభాత తెలుగు ఆరాధన :**
   ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు

   **సాయంకాల తెలుగు ఆరాధన :**
   సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
   స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

   యు.పి.ఎఫ్. ఆలయంలో ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు **డిజిటల్ సర్వీస్** జరుగును.

   **ఇంగ్లీషు మరియు హిందీ ఆరాధన :**
   సా॥ 4.00 గం॥ల నుండి 6.00 గం॥ల వరకు
   **జూమ్‌లో మాత్రమే జరుగును.**

   **సండే స్కూల్ :** ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
   స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్,
   బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.
2. **సోమవారము:**
   **తల్లుల సహవాసము, మెన్స్ ఫెలోషిప్, మండే స్కూల్**
   సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
3. **మంగళవారము : యంగ్ ఉమెన్స్ ఫెలోషిప్**
   సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు
4. **బుధవారము : తేనెధారలు కార్యక్రమము**
   సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
5. **గురువారము : వాలంటీర్స్ మీటింగ్**
   సా॥ 7.00 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు
6. **శుక్రవారము :**
   **ప్రభాత ఆరాధన** - ఉ॥ 5.00 గం॥లకు
   **గ్రాండ్ పేరెంట్స్ మీటింగ్** - ఉ॥ 10.00 గం॥లకు
   **శుక్రవారము ఉపవాస ప్రార్థన** - సా॥ 6.00 గం॥లకు
7. **శనివారము :**
   **యౌవనస్థుల కూడిక & మెన్స్ ఫెలోషిప్**
   సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
   స్థలం : యు.పి.ఎఫ్. ఆలయం, రాంనగర్‌లో జరుగును.

**24/7 నిరంతర ప్రార్థనలు**
రాత్రింబవళ్ళు, నిరంతరము జూమ్‌ద్వారా ప్రార్థనలు జరుగును

ప్రతి నెల చివరి బుధవారము **సంపూర్ణ రాత్రి ప్రార్థన**
సమయం : రా॥ 9.00 గం॥ల నుండి ఉ॥ 5.00 గం॥ల వరకు
స్థలం : సెంటినరి బాప్టిస్టు చర్చి, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.

ప్రతి నెల మొదటి ఆదివారము **కుటుంబ ఆదివారము**
సమయం: ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి నెల చివరి ఆదివారము **కృతజ్ఞత స్తుతి ఆరాధన**
సమయం : ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి సం॥ జనవరి 26వ తేది **ఫ్యామిలీ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్.

ప్రతి సం॥ ఆగష్టు 15వ తేది: **వన్‌డే యూత్ రిట్రీట్** మరియు
ప్రతి సం॥ అక్టోబర్ 02వ తేది **ఉమెన్స్ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

## జీవపు మాటలు టి.వి. కార్యక్రమాలు

1. **ఆరాధన ఛానల్ :** ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు
2. **శుభవార్త ఛానల్ :** సోమవారము నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు, ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు
3. **కల్వరి ఛానల్ :** ప్రతి రోజు ఉ॥ 9 గం॥లకు & రా॥10.30ని॥లకు

**జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.**

| ప్రతి నెల మొదటి గురువారం<br>**24 గంటలు స్తుతి ఆరాధన**<br>ఉ॥ 6.00 గం॥ల నుండి మరుసటి రోజు<br>ఉ॥ 6.00 గం॥ల వరకు | ప్రతి నెల రెండవ శనివారము<br>**ప్రత్యేక ఉపవాస ప్రార్థన**<br>సమయం: ఉ॥ 9 గం॥ల నుండి<br>సా॥ 5.00 గం॥ల వరకు |
|---|---|
| స్థలం : రాంనగర్, యు.పి.ఎఫ్. ఆలయంలో | |

సేవలో పాలుపొందండి
7901236907

**యు.పి.ఎఫ్. పరిచర్య కొరకు ప్రార్థించగలరు:**
Zoom Meeting ID: 9550504718 Code :7777
E-mail id: joycherian@hotmail.com
www.upf.org.in
Youtube / Joy Cherian - Upf
Facebook / Joy Cherian - Upf
Instagram / Joy Cherian - UPF
9550504718

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862